



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 131 | శుక్రవారం 17 అక్టోబర్ 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




# 2047 నాటికి వికసిత్ భారత్

**కర్నూలు-సూర్య వాస్తవం, అక్టోబరు16:** ఏపీ ఆత్మగౌరవం.. సంస్కృతికి నిలయంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభివర్ణించారు. ఏపీలో అనంత అవకాశాలు ఉన్నాయని ఉద్ఘాటించారు. సైన్స్ అండ్ టెక్నాలజీలోనూ యువ శక్తి ఉందని నొక్కిచెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రూపంలో ఏపీకి శక్తివంతమైన నాయకత్వం ఉందని ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా ఏపీకి సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. 16 నెలల్లో అభివృద్ధి డబుల్ ఇంజిన్‌లా దూసుకుపోతోందని ఉద్ఘాటించారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ.

**ఢిల్లీ, అమరావతి కలిసి పనిచేస్తున్నాయి..**

అభివృద్ధి కోసం ఢిల్లీ, అమరావతి కలిసి పనిచేస్తున్నాయని ప్రధాని మోదీ వెల్లడించారు. గురువారం కర్నూలు జిల్లాలోని నన్నూరులో 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగించారు. ఈ సభలో సోదర, సోదరీమణులకు నమస్కారం అంటూ తెలుగులో మోదీ ప్రసంగించారు. అహోబిళం, మహానంది, మంత్రాలయం స్వాముల ఆశీస్సులు కోరుకుంటున్నామని ఆకాంక్షించారు. ద్వితీయ జ్యోతిర్లింగమైన మల్లికార్జునస్వామి ఆశీస్సులు పొందానని చెప్పుకొచ్చారు. సోమనాథుడు కొలువైన గడ్డపై పుట్టానని ఉద్ఘాటించారు. విశ్వనాథుడికి సేవ చేసే భాగ్యం కలిగిందని పేర్కొన్నారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ.

- మిగతా 2లో..

**వికసిత్ భారత్..**

'2047 నాటికి మన దేశం వికసిత్ భారత్‌గా మారుతుంది. 21వ శతాబ్దం.. 140 కోట్ల భారతీయుల శతాబ్దం. పలు ప్రాజెక్టులతో ఏపీలో కనెక్టివిటీ బలోపేతం అవుతుంది. ప్రాజెక్టులతో పరిశ్రమలకు ఊతం.. ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. దేశం అభివృద్ధి చెందాలంటే ఇంధన భద్రత కీలకం. ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులతో దేశ ఇంధన సామర్థ్యం పెరుగుతుంది. దేశంలోని ప్రతి గ్రామంలో విద్యుద్దీకరణ జరిగింది. తలసరి విద్యుత్ వినియోగం 1400 యూనిట్లకు పెరిగింది. దేశంలో ఇంధన విప్లవానికి ఏపీ కేరాఫ్‌గా మారింది. ఇళ్లతో పాటు పరిశ్రమలకు తగిన విద్యుత్ అందుతోంది. సహజ వాయువు పైపులైన్‌తో రూ.15 లక్షల ఇళ్లకు గ్యాస్ సరఫరా అందిస్తున్నాం. చిత్తూరు LPG బాటిలింగ్ ప్లాంటుకు రోజూ 20 వేల సిలిండర్లు నింపే సామర్థ్యం ఉంది' అని పేర్కొన్నారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ.

**స్వర్ణాంధ్ర సహకారం..**

'వికసిత్ భారత్ లక్ష్యానికి స్వర్ణాంధ్ర ఎంతో సహకారం అందిస్తోంది. భారత్, ఏపీ అభివృద్ధిని ప్రపంచమంతా గమనిస్తోంది. గూగుల్ లాంటి కంపెనీ ఏపీలో పెట్టుబడి పెడుతోంది. అమెరికా వెలుపల అతిపెద్ద పెట్టుబడి పెడుతున్నట్లు గూగుల్ సీఈవో చెప్పారు. విశాఖలో ఏఐ హబ్, డేటా సెంటర్, సబ్ సీ కేబుల్ వంటి భారీ ప్రాజెక్ట్‌లు వస్తున్నాయి. సబ్ సీ కేబుల్ వ్యవస్థకు విశాఖపట్నం గేట్ వేగా మారబోతోంది. విశాఖ నుంచే ప్రపంచానికి సేవలు అందబోతున్నాయి' అని వ్యాఖ్యానించారు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ.

# 50శాతంతోనే ఎన్నికలకు వెళ్లండి



**హైదరాబాద్-సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన హైకోర్టు స్టేను ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. ఈ అంశం ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించేందుకు నిరాకరించింది. అయితే తమ ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని, మెరిట్స్ ప్రకారమే ముందుకెళ్లాలని హైకోర్టుకు సూచించింది.

- మిగతా 2లో..

- తెలంగాణ సర్కార్‌కు సుప్రీంకోర్టు ఆదేశం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్ డిస్మిస్
- ఈ అంశం హైకోర్టులో ఉన్నందున విచారణకు నిరాకరణ
- మెరిట్స్ ప్రకారమే విచారణ చేపట్టాలని హైకోర్టుకు సూచన

# అంబేద్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్శిటీలో .. త్వరలో అడ్మిషన్ల ప్రక్రియకు శ్రీకారం..!





- విసిగా ప్రొఫెసర్ విజయభాస్కర్ నియామకం
- నెరవేరుతున్న ఏపీ వాసుల చిరకాల కల
- కృషీవలుడు జోషీకి ప్రశంసలు

**సూర్యవాస్తవం, అమరావతి ప్రత్యేక ప్రతినిధి:** నవ్యాంధ్రప్రదేశ్లో త్వరలో ఏర్పడబోయే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్సిటీ కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతాయని ఇన్చార్జి విసి గా నియమితులైన ప్రొఫెసర్ విజయభాస్కర్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఏర్పడిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్సిటీ రాష్ట్ర విభజన అనంతరం కూడా ఆంధ్రప్రదేశ్ తెలంగాణలోనూ తన విద్యా సేవలను అందించింది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు అయిన తర్వాత ఆంధ్రప్రదేశ్లో ఈ సేవలు నిలిచిపోయాయి. దీనితో వేలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైంది. ఇలాంటి పరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో ఆంధ్ర ప్రదేశ్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయటానికి మార్గం సుగమం అయింది. ఏలూరు జిల్లా సమీపంలో యూనివర్సిటీ తన కార్యకలాపాలను నిర్వహించబోతోంది.

- మిగతా 2లో..

# ఛత్తీస్‌గఢ్‌లో 170 మంది మావోయిస్టుల లొంగుబాటు

**- ఆశన్న సైతం.. - కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటన**



**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** ఛత్తీస్‌గఢ్‌లో 170మంది మావోయిస్టులతో పాటు అగ్రనేత ఆశన్న కూడా లొంగిపోయినట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని రెండు ప్రాంతాల్లో మావోయిస్టుల ప్రభావం తగ్గిపోయినట్టు తెలిపారు. బుధవారం ఛత్తీస్‌గఢ్‌లో 27 మంది, మహారాష్ట్రలో 61మంది మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు. రెండ్రోజుల్లో మొత్తంగా 258మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారని తెలిపారు. వీరంతా హింసా మార్గం వీడి రాజ్యాంగంపై విశ్వాసం చూపటాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. ఆయుధాలతో పోరాడేవారికి భద్రతాదళాలే తగిన సమాధానం చెబుతాయన్నారు. జనజీవన స్రవంతిలో కలవాలని తుపాకీతో పోరాటం చేస్తున్న వారికి మరోసారి పిలుపునిస్తున్నట్టు చెప్పారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి మావోయిస్టుల్ని తుదముట్టించటానికి కేంద్రం కట్టుబడి ఉన్నట్టు అమిత్ షా తేల్చి చెప్పారు.

- మిగతా 2లో..

**లొంగిపోయిన అగ్రనేత**

ములుగు జిల్లా పోలోనిపల్లికి చెందిన ఆశన్న ఐటీఐ, పాలిటెక్నిక్ చదివారు. 1991లో పీపుల్స్‌వార్ పార్టీలో చేరిన ఆయన, 1999లో పీపుల్స్‌వార్ యాక్షన్ టీం సారథిగా పగ్గాలు చేపట్టారు. అదే ఏడాది హైదరాబాద్‌లో ఐపీఎస్ అధికారి ఉమేశ్ చంద్రను పట్టపగలే నడిరోడ్డుపై హత్య చేసిన ఆపరేషన్‌కు ఆయనే నేతృత్వం వహించినట్టు ప్రచారంలో ఉంది. 2000లో ఉమ్మడి ఏపీ హోంమంత్రి ఎ.మాధవరెడ్డి ప్రయాణిస్తున్న కారును మందుపాతరతో పేల్చేసి చంపేయడం, 2003లో అలిపిరిలో అప్పటి సీఎం చంద్రబాబు కాన్వారును క్లెమోర్‌మైన్‌తో పేల్చి ఆయనపై హత్యాయత్నానికి పాల్పడిన దుశ్చర్యలతో ఆశన్న పేరు విస్తృతంగా ప్రచారమైంది.

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# ఏసీబీ వలలో.. కమర్షియల్ తిమింగళం..!

- నగదుతో పట్టుబడ్డ ఉద్యోగి
- వేధిస్తూ అక్రమ వసూళ్లు
- వాణిజ్య శాఖలో అలజడి



**సూర్యవాస్తవం, ప్రత్యేక ప్రతినిధి, విజయవాడ:** కమర్షియల్ ట్యాక్స్ శాఖలో ఏళ్లుగా పాతుకుపోయిన అవినీతి తిమింగళాన్ని ఏసీబీ అధికారులు గురువారం సాయంత్రం వలపన్ని పట్టు కున్నారు. వాణిజ్య పన్నుల శాఖ గవర్నర్ పేట డివిజన్లో ఒక సాధారణ అటెండర్ స్థాయిలో విధులు నిర్వహించే కొండపల్లి శ్రీనివాస్ తరచూ వ్యాపారులను బెదిరిస్తూ..

- మిగతా 2లో..

# 2047 నాటికి వికసిత్ భారత్

(మొదటిపేజీ తరువాయి)

**మల్టీమోడల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల అభివృద్ధి..**

'వికసిత్ భారత్ లక్ష్య సాధనకు మల్టీమోడల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు అభివృద్ధి చేస్తున్నాం. సబ్బవరం- షీలానగర్ హైవేతో కనెక్టివిటీ మరింత పెరుగుతుంది. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక కారిడార్లతో ఉపాధి లభిస్తోంది. భారత్‌ను 21వ శతాబ్దపు తయారీ కేంద్రంగా ప్రపంచం చూస్తోంది. ఏపీ అభివృద్ధికి రాయలసీమ అభివృద్ధి చాలా ముఖ్యం. రాయలసీమ జిల్లాల్లో ఉపాధి కల్పించేలా పలు ప్రాజెక్టులు వస్తున్నాయి. ప్రజలే ప్రాధాన్యంగా మా ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధే మా విధానం. జీఎస్టీ భారాన్ని కూడా తగ్గించాం. జీఎస్టీ పొదుపు ఉత్సవాన్ని పండుగగా చేసుకున్నారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఉత్సవాన్ని జరుపుకోవడం ఆనందాన్నిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏపీ సామర్థ్యాన్ని విస్మరించాయి. దేశాన్ని ముందుకు నడిపించే శక్తి ఏపీకి ఉంది. ఏపీ మాత్రం సొంత అభివృద్ధి కోసం పోరాడే దుస్థితి కలిగింది. ఎన్డీఏ హయాంలో ఏపీ ముఖచిత్రం మారుతోంది. నిమ్మలూరు నైట్ విజన్ పరికరాల తయారీ ఫ్యాక్టరీ.. రక్షణ రంగంలో కీలకపాత్ర పోషించబోతోంది. కర్నూల్‌ను డ్రోన్ హబ్‌గా మార్చాలన్నది ప్రభుత్వం సంకల్పం' అని పేర్కొన్నారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ.

# అంబేద్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్శిటీలో .. త్వరలో అడ్మిషన్ల ప్రక్రియకు శ్రీకారం..!

(మొదటిపేజీ తరువాయి)

విభజిత ఆంధ్రప్రదేశ్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్సిటీకి ఓఎస్డీగా వ్యవహరించిన డాక్టర్ వెలగా జోషి కృషితో ప్రభుత్వంతో వివిధ దశల్లో చేసిన సంప్రదింపుల నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్సిటీ ఆంధ్ర ప్రదేశ్ లో ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రక్రియ పూర్తికి వెలగా జోషి అహర్నిశలు జరిపిన కృషికి పరిపరి విధాల ప్రశంసలు దక్కుతున్నాయి.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ విజయభాస్కర్ ను ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఓ ఎస్ డి డాక్టర్ వెలగా జోషి కలిసి అభినందనలు తెలియజేసారు. యూనివర్సిటీ పాలన వ్యవహారాలపై చర్చించారు. గత కొంతకాలంగా నిలిచిపోయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్సిటీ లోని అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేద్దామని, విద్యార్థులకు విద్యా సంవత్సరం నష్టపోకుండా చర్యలు చేపడతామని వారు నిర్ణయం తీసుకున్నారు.

# నిష్పక్షపాతమైన దర్యాప్తు జరపండి

**- సుప్రీంకోర్టును ఆశ్రయించిన 'అహ్మదాబాద్' పైలట్ తండ్రి**



**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై నిష్పక్షపాతమైన, సాంకేతికంగా ఉన్నతమైన దర్యాప్తు జరపాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలయింది. ఈ ప్రమాదంలో మరణించిన పైలట్ సుమీత్ సభర్వాల్ తండ్రి పుష్కరరాజ్ సభర్వాల్, భారత పైలట్ల సంఘం ఈ పిటిషన్ వేశారు. సుప్రీంకోర్టు మాజీ మాజీ జడ్జీ నేతృత్వంలో కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని పిటీషన్‌లో కోరారు. ఈ ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) సమర్పించిన నివేదికలో కొన్ని అంశాలు పైలట్ల తప్పిదాలను సూచిస్తున్నాయని సెప్టెంబరు 22న సుప్రీంకోర్టు గుర్తించింది. అలాగే మరొక పిటిషన్ విచారణలో డీజీసీఏకు నోటీసులు జారీచేసింది. ఈ నేపథ్యంలోనే విమాన ప్రమాదంపై న్యాయమైన, పారదర్శకమైన దర్యాప్తు జరపాలని 91 ఏండ్ల పుష్కరాజ్ సభర్వాల్ తన పిటిషన్‌లో కోరారు. ఏఏఐబీ విచారణ పైలట్ల ప్రతిష్టను దెబ్బతీసేవిధంగానూ, లోపభూయిష్టంగానూ, పక్షపాతంగానూ ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే తన కుమారుడు సుమీత్ 30 ఏండ్లకు పైగా మచ్చలేని కెరీర్‌ను కలిగి ఉన్నాడని, 15,638 గంటల పాటు విమాన ప్రయాణాన్ని ఒక్క లోపం కూడా లేకుండా నిర్వర్తించాడని పిటిషన్‌లో గుర్తు చేశారు. ఈ పిటిషన్ దీపావళి సెలవుల తరువాత విచారణకు వచ్చే అవకాశం ఉంది. జూన్ 12న అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో 260 మంది మరణించిన సంగతి తెలిసిందే. మృతుల్లో పైలట్ సుమీత్ సభర్వాల్‌తో సహా 12 మంది సిబ్బంది ఉన్నారు.

# రష్యా చమురు దిగుమతిదార్లపై ఏకపక్ష ఆంక్షలను సహించం

**- అమెరికాకు చైనా తీవ్ర హెచ్చరిక - ప్రతి చర్యలు తప్పవని స్పష్టీకరణ**

**హైదరాబాద్- సూర్య వాస్తవం, అక్టోబర్ 16** రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న చైనా, భారత్ తదితర దేశాలపై ఆంక్షలు, సుంకాలు విధిస్తామంటూ పదేపదే బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తున్న అమెరికా తీరుపై చైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. రష్యా నుండి చమురు కొనుగోలు చేయబోమంటూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తమకు హామీ ఇచ్చారని, ఈ విషయంలో చైనా కూడా తొందరలోనే నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పేర్కొన్న సంగతి తెలిసిందే. చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ గురువారం నాడు నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రస్తావనకు రాగా..అమెరికా తీరుపై జియాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకపక్ష ఆంక్షలను సహించే ప్రసక్తే లేదని, తీరు మారకపోతే ప్రతి తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించారు. రష్యా నుండి చమురు దిగుమతి చేసుకోవడాన్ని సమర్థించుకున్నారు. రష్యా నుంచి చమురు దిగుమతులు చట్టబద్ధమైనవని, ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తి ఉండదన్నారు. అమెరికా వైఖరి ఏకపక్ష బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. ఆర్థికపరమైన ఒత్తిళ్లకు గురిచేడమే అమెరికా ఉద్దేశ్యంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఒంటెద్దు పోకడల వల్ల అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ పారిశ్రామిక, సరఫరా గొలుసుల భద్రత, సుస్థిరతకు ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. రష్యాతో సహా పలు ప్రపంచ దేశాలతో చైనా సాధారణ వాణిజ్య, ఇంధన సహకారాన్ని కొనసాగిస్తోందని, ఇది పూర్తి చట్టబద్ధమైనదని జియాన్ స్పష్టం చేశారు.

# 50శాతంతోనే ఎన్నికలకు వెళ్లండి

(మొదటిపేజీ తరువాయి)

ఒక వేళ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలంటే పాత రిజర్వేషన్ల ఆధారంగా వెళ్లొచ్చని స్పష్టత ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 9ని తీసుకువచ్చింది. అయితే.. ఈ జీవోను మాధవ రెడ్డి, మరొకరు రాష్ట్ర హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం జీవోపై ఈనెల 9న స్టే విధించింది.

దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 13న సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను గురువారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, ప్రతివాదుల తరపున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణ్, కె.వివేక్ రెడ్డి, మయూర్ రెడ్డి వాదనలు వినిపించారు. తొలుత సింఘ్వీ వాదనలు వినిపిస్తూ%ొ% రిజర్వేషన్లు నిర్ణయించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. తెలంగాణ బీసీ బిల్లుకు రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదం ఇవ్వలేదని కోర్టుకు నివేదించారు.

అయితే అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలిపాయని చెప్పారు. శాస్త్రీయంగా కుల సర్వే నిర్వహించి, డేటా బేస్ ఆధారంగా రిజర్వేషన్లు నిర్ణయించుకోవచ్చని ఇందిరా సాహ్నీ కేసులో తొమ్మిది మంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసిందని చెప్పారు. 'దేశంలో ఎక్కడా లేని విధంగా పకడ్బందీ సర్వే నిర్వహించాం. గవర్నర్ బిల్లు పెండింగ్‌లో పెట్టడం వల్ల ఈ పరిస్థితి వచ్చింది. ఏకాభిప్రాయంతో ఆమోదించిన బిల్లును పెండింగ్‌లో పెట్టారు. బిల్లును ఛాలెంజ్ చేయకుండా బిల్లు ద్వారా విడుదల చేసిన జీవోను సవాల్ చేశారు. రిజర్వేషన్లను పెంచుకునే సౌలభ్యం ఉంది. సుప్రీంకోర్టు విధించిన ట్రిపుల్ టెస్ట్ కండిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది' అని నివేదించారు.

**శాస్త్రీయంగా చేపట్టాం..**

దేశంలోనే తొలిసారి శాస్త్రీయంగా బీసీల లెక్కలు తీసీ, తద్వారా రిజర్లేషన్ల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లిందని సింఘ్వీ వాదించారు. 'డెడికేట్ కమిషన్ ద్వారా సర్వే జరిపి వెంపరికల్ డేటా సేకరించింది. కమిషన్ సిఫారసు ప్రకారం.. రిజర్వేషన్లు నిర్ణయించాం. బీసీ జనాభా డేటా ఆధారంగానే బీసీల రిజర్వేషన్లు పెంచాము. ఇంటింటికి తిరిగి సామాజిక ఆర్థిక కుల సర్వే నిర్వహించాం. సమగ్రంగా, సాంకేతికంగా సర్వే జరిపాం. అన్ని వర్గాలతో విస్తత సంప్రదింపులు జరిపాం. ఇండియాలో ఎక్కడా లేని విధంగా ఈ సర్వే నిర్వహించాం. దీనిపై స్టే ఎలా విధిస్తారు? హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో ఎలాంటి సహేతుక కారణాలు వెల్లడించలేదు. వెంపరికల్ డేటా ద్వారా ట్రిపుల్ టెస్ట్ నిర్వహించి రిజర్వేషన్లు పెంచుకోవచ్చని గౌలి కెసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది' అని గుర్తు చేశారు. అయితే అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులు గవర్నర్, రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

మార్చిలో ఈ బిల్లులను గవర్నర్‌కు పంపామని, గవర్నర్ ఈ బిల్లులను రాష్ట్రపతికి పంపి ఊరుకున్నారని తెలిపారు. అయితే రాష్ట్రపతి, గవర్నర్ల నుంచి నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. 119 మంది ఎమ్మెల్యేలు కలిసి ఏకగ్రీవంగా చేసిన నిర్ణయాన్ని పెండింగ్‌లో పెడితే ఎలా అని సింఘ్వీ ప్రశ్నించారు. మధ్యలో ధర్మాసనం జోక్యం చేసుకొని%ొ% రిజర్వేషన్ల జీవో ఇచ్చే ముందు బిల్లుకు నోటిఫికేషన్ ఇచ్చారా? అని ప్రభుత్వాన్ని అడిగింది. ఇందుకు సింఘ్వీ బదులిస్తూ%ొ% గవర్నర్ బిల్లులను ఆమోదించనప్పుడు గవాయి కేసులో గైడ్ లైన్స్ ఫాలో అయి జీవో 9ని జారీ చేసినట్టు చెప్పారు. ఈ విషయంలో శాస్త్రీయంగానే ముందుకెళ్లినట్టు తెలిపారు. మరోసారి స్పందించిన ధర్మాసనం%ొ% రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ జీవో 9ని ఇచ్చారని, అదే రోజు ఎలక్షన్ నోటిఫికేషన్ హడావుడిగా ఇవ్వడానికి కారణమేంటని ప్రశ్నించింది. చట్ట సభలో అన్ని రాజకీయ పార్టీల ఆమోదం తర్వాతే.. ప్రజా ఆమోదంతో ఈ నిర్ణయం తీసుకున్నామని, ఈ చట్టాన్ని ఎవరు సవాల్ చేయలేరని ప్రభుత్వం తెలిపింది.

**చట్టాన్ని కాదొ 67శాతం రిజర్వేషన్లను సవాల్ చేస్తున్నాం: ప్రతివాది అడ్వొకేట్ నారాయణ్**

ఈ వాదనలపై ప్రతివాది తరపున గోపాల్ శంకర్ నారాయణ్ అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సర్వే, క్యాబినెట్ నిర్ణయాలను తప్పుబట్టడం లేదని, కేవలం రాజ్యాంగంలోని నిబంధనలకు వ్యతిరేకంగా ఓబీసీ రిజర్వేషన్లు పెంచడాన్ని సవాల్ చేస్తున్నట్టు చెప్పారు. 'ఎన్నికల్ని సవాల్ చేయడం లేదు. పెంచిన బీసీ రిజర్వేషన్లను కలుపుకొని 67 శాతానికి పెరుగుతున్న రిజర్వేషన్లను సవాల్ చేస్తున్నాం.' అని నారాయణ్ చెప్పారు. మధ్యలో కోర్టు జోక్యం చేసుకొని%ొ% రిజర్వేషన్లు 50 మించకూడదంటే ఎస్సీ, ఎస్టీలకు తగ్గించాల్సి వస్తుంది కదా? అని ప్రశ్నించారు. అవునని ప్రతివాది అడ్వొకేట్లు బదులిచ్చారు. రాజ్యాంగంలోని పలు ఆర్టికల్స్ ప్రకారం%ొ% రిజర్వేషన్లు 50 శాతం మించ కూడదని అనేక సందర్భాల్లో సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. షెడ్యూల్డ్ ఏరియా, గిరిజన ప్రాంతాల్లో మాత్రమే 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచకూడదనే స్పష్టమైన తీర్పు ఉందన్నారు.

తెలంగాణలో అలాంటి షెడ్యూల్ ఏరియాలు లేవని కోర్టుకు నివేదించారు. కృష్ణమూర్తి కేసులో సుప్రీంకోర్టు ఇదే తీర్పు వెలువరించిందని గుర్తు చేశారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లోనూ ప్రజా ప్రభుత్వాలు రిజర్వేషన్ల పెంపుపై చేసిన నిర్ణయాలను సుప్రీంకోర్టు తిరస్కరించిందన్నారు. 50 శాతానికి మించకుండా ఎన్నికలకు వెళ్లాలని సుప్రీంకోర్టు సూచించిం దన్నారు. ట్రిపుల్ టెస్ట్ లో కూడా 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండవు అని వాదనలు వినిపించారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్టు వెల్లడించిం ది. అయితే సింఘ్వీ జోక్యం చేసుకొని ప్రస్తుతం ఈ అంశం హైకోర్టులో ఉందన్నారు. అయితే ఈ విషయాన్ని అక్కడే తేల్చుకోవాలని, హైకోర్టు మెరిట్స్‌లోకి వెళ్లాలని సూచించింది. వీలైతే పాత రిజర్వేషన్ల ప్రకారమే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లొచ్చని స్పష్టం చేసింది.


# ఏసీబీ వలలో.. కమర్షియల్ తిమింగళం..!

(మొదటిపేజీ తరువాయి)

వారి వద్ద నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులకు గతంలో అనేక మార్లు ఫిర్యాదులు అందాయి. పలు సందర్భాల్లో అతను ఏసీబీ అధికారులకు చిక్కినట్లే చిక్కి తృటిలో తప్పించుకున్నాడు. గురువారం సాయంత్రం సర్కిల్ ఆఫీసుకు సమీపంలోని అవంతి ట్రాన్స్ పోర్టు యజమానులను రైడ్ల సాకుగా వేధించి వేలల్లో నగదును వసూలు చేస్తుండగా కచ్చితమైన సమాచారంతో ఏసీబీ విజయవాడ డీఎస్పీ సుబ్బారావు ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ బృందాలు వలపన్ని పట్టుకున్నాయి.

అతని వద్దనుంచి 15 వేల నగదును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు, రసాయనిక పరీక్ష ద్వారా అవినీతి వసూళ్లకు పాల్పడుతున్నట్లు నిర్ధారించారు. వివిధ చోట్లకు వసూళ్ల నిమిత్తం తీసుకెళ్లే వాహనాన్ని సైతం స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసి తమ అధీనంలోకి తీసుకున్నారు. డివిజన్ లో విధులు నిర్వహించే ఒక అధికారి అండదండలతో నిందితుడు వ్యాపారులను వివిధ కారణాలు సాకుగా చూపి పలు రకాలుగా వేధించడం ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. గతంలో కూడా నిందితుడు ఇదే తరహా అక్రమ వసూళ్లకు పాల్పడుతూ 2017 ప్రాంతంలో ఏసీబీ అధికారులకు పట్టుబడి.. ఏడాది పాటు సస్పెన్షన్ వేటుకు గురైన్నపటికి, ఏ మాత్రం మార్పు రాకపోవడంపై సహచర ఉద్యోగులు పలు రకాలుగా చర్చించు కుంటున్నారు. గతంలో శాఖాపరమైన చర్యల్లో భాగంగా .. విధినిర్వహణలో భాగంగా గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే పరిమితం కావాలని నగర వ్యవహారాల్లో జోక్యం వద్దని రాత



పూర్వకంగా హెచ్చరించినా వైఖరి మార్చుకోవడం లేదని సహోద్యోగులు వాపోతున్నారు. ఆ శాఖలోని కొందరు ఉన్నతాధికారుల రహస్య అందండలతో కొనసాగుతున్న ఈ అక్రమ వసూళ్లపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో శాఖాపరమైన సమగ్ర విచారణకు ఆదేశిస్తే .. వాస్తవాలు వెలుగులోకి వస్తాయని.. ఒకరు కొకరు వత్తాసు పలుకుతూ సాగిస్తున్న రహస్య లావాదేవీల గుట్టు రట్టవుతుందని పలువురు పేర్కొంటున్నారు. చాలా ఏళ్ల తరువాత అక్రమ వసూళ్ల వ్యవహారం ఏసీబీ దాడులతో వెలుగులోకి రావడంతో నగర పరిధిలోని వాణిజ్య పన్నుల శాఖలో గుబులు మొదలైంది.

# గాజాలో ఎటు చూసినా విధ్వంసమే

**హైదరాబాద్-సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** ఇజ్రాయిల్ మారణహోమం కారణంగా చెట్టుకొకరు పుట్టకొకరుగా చెల్లాచెదురై ఇతర ప్రాంతాల్లో తల దాచుకుంటున్న వేలాది మంది గాజా వాసులు కాల్పుల విరమణ తర్వాత తిరిగి స్వస్థలాలకు చేరు కుంటున్నారు. కానీ అక్కడి దృశ్యాలు వారిని కలచి వేస్తున్నాయి. జనావాసాలన్నీ ఇజ్రాయిల్ దాడిలో ఎప్పుడో నేలమట్టమయ్యాయి. ఇప్పుడక్కడ శిథిలాలు మాత్రమే దర్శన మిసున్నాయి. సర్వం కోల్పోయిన బాధితులకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం, వ్యాపారాలను తిరిగి ప్రారంభించడం, మూత పడిన సంస్థలను తెరవడం, జనజీవనాన్ని గాడిలో పెట్టడం ఈ పనులు అంత తేలికగా పూర్తయ్యేవి కావు. గాజాలో ఇజ్రాయిల్ సాగించిన విధ్వంసం కారణంగా 70 బిలియన డాలర్ల నష్టం జరిగిందని ఐక్య రాజ్యసమితి అంచనా వేసింది.

**మౌలిక వసతులపై దృష్టి**

శిథిలాల తొలగింపు భగీరథ ప్రయత్నమే. ఆ పని పూర్తయిన తర్వాత నీరు, పారిశుధ్యం, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టాల్సి ఉంటుంది. గాజా ప్రజలకు తక్షణమే సురక్షితమైన తాగునీరు అందించాలి. 2023 సెప్టెంబర్ 7వ తేదీ తర్వాత ఈ ప్రాంతం లోని 600 నీరు, పారిశుధ్య సౌకర్యాలు ధ్వంసమవడమో లేదా దెబ్బతినడమో జరిగింది. మురుగు నీటి యాజమాన్యం కూడా చాలా ముఖ్య మైనదే. అది సరిగా లేకుంటే వ్యాధులు ప్రబలుతాయి. గాజా లో డయేరియా వ్యాధి ఎక్కువగా ఉంది. ఇది చిన్నారుల ప్రాణాలను హరిస్తుంది. కొన్ని చోట్ల కలరా ముప్పు కూడా పొంచి ఉంది. గాజాలో ఆరు మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు ఉండగా అవన్నీ ఇజ్రాయిల్ దాడిలో పూర్తిగా ధ్వంసమయ్యాయి. రక్షిత మంచినీరు అందించే ప్లాంట్లు కూడా దెబ్బతిన్నాయి. ఇప్పుడు పనులు ఎక్కడి నుంచి మొదలు పెట్టాలో అర్థంకావడం లేదని సహాయ సిబ్బంది అంటున్నారు.

**శిథిలాల కుప్పలు**

గాజా ప్రాంతంలో 84 శాతం మేర విధ్వంసం జరిగిందని పాలస్తీనియన్ల కోసం ఐరాస చేపట్టిన అభివృద్ధి కార్యక్రమానికి ప్రత్యేక ప్రతినిధిగా వ్యవహరిస్తున్న జాకో సిల్లియర్స్ చెప్పారు. గాజా సిటీ వంటి కొన్ని ప్రాంతాల్లో దీని స్థాయి 92 శాతం వరకూ ఉంది. ఇప్పుడు అక్కడ ఎక్కడ చూసినా శిథిలాలే కన్పిస్తున్నాయి. గాజాలో 60 మిలియన్ టన్నుల శిథిలాలు పేరుకుపోయాయని ఓ అంచనా. పునర్నిర్మాణ పనులు చేపట్టాలంటే ముందుగా యుద్ధం మిగిల్చిన శిథిలాల కుప్పలను తొలగించాల్సి ఉంటుంది. దారుణమేమంటే ఈ శిథిలాలలో ఆవాసాల అవశేషాలే కాదు మానవ కళేబరాలు, పేలని బాంబులు కూడా ఉన్నాయి. ముందుగా వాటిని జాగ్రత్తగా తొలగించి ధ్వంసం చేయాల్సిన అవసరం ఉంది. తొలగించిన భవన శిథిలాలను నిర్మాణాలకు పునాదులుగా ఉపయోగించుకోవచ్చు. కానీ ఆవాసాల నిర్మాణానికి పెద్ద ఎత్తున సామగ్రిని దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది.

**దెబ్బతిన్న పంటలు- మూతపడ్డ బడులు**

యుద్ధంతో వ్యవసాయ రంగం పూర్తిగా కుదేలైపోయింది. గాజా స్ట్రిప్‌లో 82.4 శాతం వార్షిక పంటలు, 97 శాతానికి పైగా చెట్ల పంటలకు నష్టం వాటిల్లింది. మానవతా సాయంపై దీర్ఘకాల ఆంక్షలతో ఆహార భద్రత కరువైంది. గాజా నగరాన్ని సెప్టెంబరులో కరువు ప్రాంతంగా ప్రకటించారు. యుద్ధానికి ముందు గాజా జనాభాలో దాదాపు సగం మంది 18 సంవత్సరాల లోపు వయసున్న వారే. కాబట్టి జనజీవనం తిరిగి సాధారణ స్థాయికి చేరుకోవాలంటే వెంటనే పాఠశాలల నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంటుంది. యుద్ధ సమయంలో నిర్వాసితులకు పాఠశాలల్లోనే పునరావాసం కల్పించారు. దీంతో ఇజ్రాయిల్ దళాలు వాటిని లక్ష్యంగా చేసుకొని బాంబు దాడులు జరిపాయి. ఇప్పుడు 91.8 శాతం పాఠశాల భవనాలను పూర్తిగా పునర్నిర్మించడమో లేక వాటికి భారీగా మరమ్మతులు చేయడమో జరగాల్సి ఉంది.

**ఇజ్రాయిల్ దాడిలో ముగ్గురు పాలస్తీనియన్లు మృతి..**

కాల్పుల విరమణ అమల్లో వున్నా ఇజ్రాయిల్ సైన్యం దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడిలో ముగ్గురు పాలస్తీనియన్లు మరణించినట్టు మీడియా వర్గాలు గురువారం తెలిపాయి. గాజా మరియు ఈజిప్ట్ మధ్య రఫా క్రాసింగ్‌ను ప్రజల రాకపోకల కోసం తెరవడం ఆలస్యమవుతుందని ఇజ్రాయిల్ ప్రభుత్వ సంస్థ తెలిపింది. గాజా కాల్పుల విరమణ విఫలమైతే హమాస్‌ను ఓడించేందుకు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి సైన్యాన్ని ఆదేశించినట్లు మీడియా వెల్లడించింది .

దశాబ్దాలు పట్టొచ్చు

ఇక ఇజ్రాయిల్ దాడిలో నేలమట్టమైన ఆవాసాలకు లెక్కే లేదు. గాజాలో 2,82,904 ఇళ్లు, అపార్ట్‌మెంట్లు దెబ్బతినడమో లేదా ధ్వంసం కావడమో జరిగిందని ఐరాస ఉపగ్రహ కేంద్రం తెలిపింది. అయితే ఇంతకంటే ఎక్కువ విధ్వంసమే జరిగిందని చెబుతున్నారు. గాజా నగరంలో హమాస్ పాలనలో ఉన్న ఓ మున్సిపాలిటీలో 90 శాతం రహదారులు పనికి రాకుండా పోయాయి. గాజాలో జనావాసాల నిర్మాణానికి దశాబ్దాల సమయం పట్టవచ్చు. గాజాలో విద్యుత్ పరిస్థితి అయితే మరింత ఘోరంగా ఉంది. యుద్ధం ప్రారంభం కావడానికి ముందే అక్కడ సంక్షోభం నెలకొంది. గాజాలో ప్రతి రోజూ కొద్ది గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా జరిగేది.

## సంపాదకీయం

# వెండితెర వెలుగులే బెటర్

సినిమా రంగం నుంచి రాజకీయాల్లోకి  అడుగుపెట్టడం మన దేశంలో కొత్త కాదు. ఎన్టీఆర్, ఎంజీఆర్, జయలలిత వంటి దిగ్గజాలు వెండితెరపై తమ ఇమేజ్‌ను రాజకీయ విజయాలుగా మలచుకున్నారు. అయితే, ఈ గ్లామరస్ ప్రయాణంలో విజయ శిఖరాలను చేరుకున్నవారు కొందరైతే, క్షేత్రస్థాయి రాజకీయాల కష్టాలు, ఆర్థికపరమైన ఇబ్బందులతో నిరాశకు గురైనవారు ఎంతో మంది ఉన్నారు. రాజకీయాల వల్ల నష్టం తప్ప లాభం లేదని భావించేవారు ఈ మధ్య పెరుగుతున్నారు. తాజాగా కేరళకు చెందిన బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి సురేశ్ గోపీ .., బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు ఈ వాస్తవాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాయి.కేరళ నుంచి బీజేపీ తరపున గెలిచి కేంద్ర మంత్రివర్గంలో స్థానం పొందిన సురేశ్ గోపీ, రాజకీయాల్లో లాభం కంటే నష్టమే ఎక్కువని బహిరంగంగా ప్రకటించడం సంచలనం సృష్టించింది. సినిమాలు చేసుకుంటే మంచి ఆదాయం ఉండేదని, కానీ రాజకీయాల్లోకి వచ్చాక ఆదాయం తగ్గిపోయిందని, అవసరాలు తీరడం లేదని ఆయన వాపోయారు. మంత్రి పదవిని వదిలేసి మళ్లీ సినిమాల్లోకి వెళ్లాలని యోచిస్తున్నట్లు చెప్పడం, రాజకీయ జీవితంపై ఆయనకున్న అసంతృప్తిని తెలియజేస్తుంది.దీనికి కొనసాగింపుగా, హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన కంగనా రనౌత్  కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సినీ రంగాన్ని, రాజకీయ రంగాన్ని పోల్చుతూ.. రాజకీయం చాలా కష్టమని, పైగా ఇందులో ఆదాయం తక్కువ, ఖర్చులు ఎక్కువని నిట్టూర్చారు. ఒక నిజాయితీపరుడైన ఎంపీకి వచ్చే జీతం తమ నియోజకవర్గాల్లో పర్యటనలు, పీఏల జీతాలు, ఇతర అవసరాలకు సరిపోవడం లేదని, లక్షల్లో ఖర్చవుతోందని ఆమె వివరించారు. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే నిజాయితీగా ప్రజా సేవ చేసేందుకు ఎవరూ ముందుకు రారని కంగనా ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ స్థాయి సమస్యలను కూడా తమ వద్దకు ప్రజలు తీసుకొస్తున్నారని, వాటిని సొంత డబ్బుతో పరిష్కరించమని అడుగుతున్నారని ఆమె అసహనం వ్యక్తం చేశారు.సినిమా రంగంలో నటులు భారీ పారితోషికాలు అందుకుంటారు. వారికి ఉండే ప్రజాదరణ, స్టార్‌డమ్ తక్కువ కాలంలోనే కోట్లలో ఆదాయాన్ని ఆర్జించి పెడుతుంది. అదే సమయంలో, రాజకీయాలు ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ప్రజల కోసం పనిచేసే ప్రజాప్రతినిధులకు ఆదాయం కంటే ఖర్చులే అధికం. సినిమా స్టార్‌గా ఒక్క సినిమాకు కోట్లు తీసుకునేవారు, రాజకీయాల్లోకి వచ్చాక జీతం, అలవెన్సులు మాత్రమే ప్రధాన ఆదాయ వనరుగా ఉంటాయి. ఇది వారి మునుపటి ఆదాయంతో పోలిస్తే చాలా తక్కువ. ప్రజాప్రతినిధి అయిన తర్వాత నియోజకవర్గంలో పర్యటనలు, కార్యకర్తలను, ప్రజలను కలుసుకోవడం, వారి సమస్యలను పరిష్కరించడానికి అయ్యే ఖర్చులు ఊహించిన దానికంటే ఎక్కువగా ఉంటాయి. నటులకు తెరపై ఉండే గ్లామర్, రాజకీయాల్లో కనిపించదు. ఇక్కడ నిజమైన ప్రజాసేవ, క్షేత్రస్థాయి కష్టాలు, రాజకీయ ఒత్తిళ్లు ఉంటాయి. సినిమాలు, రాజకీయాలు రెండూ సమయాన్ని, శక్తిని డిమాండ్ చేస్తాయి. సినిమా పారితోషికం కోసం కొంత సమయం కేటాయించి, రాజకీయాలకు పూర్తి న్యాయం చేయలేకపోవడం, లేదా పూర్తిగా సినిమాలను వదులుకోలేకపోవడం వంటి సందిగ్ధత కూడా వారిలో ఆందోళన కలిగిస్తుంది.సురేశ్ గోపీ, కంగనా రనౌత్ వంటి ప్రముఖ నటుల వ్యాఖ్యలు? వెండితెర వెలుగులు, రాజకీయాల క్లిష్టత మధ్య ఉన్న ఆర్థిక, వాస్తవ వ్యత్యాసాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. గోపి కేరళ నుండి కొత్తగా ఎన్నికైన రాజ్యసభ సభ్యుడు, బిజెపి అనుభవజ్ఞుడైన సి సదానందన్ మాస్టర్‌ను కేంద్ర మంత్రివర్గంలో తన స్థానంలో నియమించాలని సిఫార్సు చేశారు. మాస్టర్ రాజకీయ సహకారాలను ఆయన హైలైట్ చేస్తూ "నన్ను తొలగించిన తర్వాత సదానందన్ మాస్టర్‌ను కేంద్ర మంత్రిగా చేయాలని నేను నిజాయితీగా చెబుతున్నాను. ఇది కేరళ రాజకీయ చరిత్రలో ఒక కొత్త అధ్యాయంగా మారుతుందని నేను నమ్ముతున్నాను" అని అన్నారు. 1994లో సిపిఐ(ఎం) కార్యకర్తలు చేసిన దాడిలో రెండు కాళ్లను కోల్పోయిన రాజకీయ హింస నుండి బయటపడిన మాస్టర్, ఉత్తర కన్నూర్ రాజకీయాల్లో మంచి పేరు సంపాదించారు.మలయాళ సినిమా రంగంలో అత్యంత ప్రజాదరణ పొందిన నటులలో ఒకరైన సురేష్ గోపి 2016 అక్టోబర్‌లో బిజెపిలో చేరారు. 2024లో త్రిసూర్ నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించినప్పటి నుండి, గోపి తన సినీ కెరీర్‌ను చాలావరకు నిలిపివేశారు, కానీ తన రాజకీయ బాధ్యతలను నిర్వర్తిస్తూనే నటనకు తిరిగి రావాలని కోరుకుంటున్నట్లు అనేకసార్లు వ్యక్తం చేశారుప్రజా జీవితంలో నిజాయితీగా, నిస్వార్థంగా పనిచేయాలంటే, ఆదాయం కంటే ఖర్చులే అధికంగా ఉండే ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో, తగినంత జీతం, అలవెన్సులు లేకపోవడం వల్ల నిస్వార్థ ప్రజాసేవకు అడ్డుగోడగా మారుతుందని ఈ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. సినిమా రంగం నుంచి వచ్చిన సెలబ్రిటీలకు ఇప్పుడిప్పుడే రాజకీయాల్లోని ఈ ఖర్చుల తత్వం బోధపడుతున్నట్టు కనిపిస్తోంది. ఇది కేవలం వ్యక్తిగత ఆవేదన మాత్రమే కాదు, భారత రాజకీయాల్లో నిజాయితీగా పనిచేయాలనుకునే ప్రతి ప్రజాప్రతినిధి ఎదుర్కొనే సవాలుకు అద్దం పడుతోంది.

# పరకామణి పాపం ఎవరిది..!



**తిరుమల, సూర్య వాస్తవం, అక్టోబరు 16 :** దేవ దేవుడి సన్నిధి. ఏడు కొండల వాడి ఖజానా. శేషాద్రివాసుడి హుండీ లెక్కించే అవకాశమే అదృష్టం. కానీ అందులో కూడా చేతివాటం ప్రదర్శించి పాపం అంటగట్టుకున్నారు కొందరు. తిరుమల తిరుపతి దేవస్థానం పరికామణి విభాగంలో జరిగిన దొంగతనం కేసు మళ్లీ లైమ్‌లైట్‌లోకి వచ్చింది. అప్పటి ఉద్యోగి రవికుమార్ 920 డాలర్లు కొట్టేశారని టీటీడీ విజిలెన్స్ అధికారులు ఏప్రిల్ 2023లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో లోక్ అదాలత్ ముందు రవికుమార్‌తో రాజీ కుదిరింది.ఈ రాజీ నిర్ణయం చట్టపరంగా ఎంతవరకు కరెక్ట్ అన్న వివాదం మొదలైంది. ఈ చోరీపై పూర్తిస్థాయి దర్యాప్తు జరగలేదని..ఓ జర్నలిస్టు హైకోర్టులో పిటిషన్ వేయడంతో మళ్లీ చర్చ స్టార్ట్ అయింది. పరకామణి చోరీ కేసుకు సంబంధించి..ఖజానా రికార్డులు, రాజీ ఒప్పంద పత్రాలు సీజ్ చేయాలని హైకోర్టు సూచించింది. అయితే పోలీస్ అధికారులు కోర్టు ఆదేశాలను పాటించలేదని లేటెస్ట్‌గా న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏకంగా పోలీస్ స్టేషన్లనే మూసివేయండి అంటూ ఘాటుగా స్పందించింది.

దీంతో వెంటనే సీఐడీ అధికారులు రంగంలోకి దిగారు. పరకామణి కేసుకు సంబంధించి టీటీడీ పాలక మండలి తీర్మానాలు.. లోక్ అదాలత్‌లో రాజీ చేసిన ఫైల్స్ అన్ని పరిశీలించారు సీఐడీ అధికారులు. ఆ డాక్యుమెంట్స్ అన్నీ సీజ్ చేశారు. సీసీ పుటేజీను కూడా పరిశీలిస్తున్నామని అధికారులు చెప్తున్నారు. పరకామణి చోరీ కేసు నమోదైన తిరుమల వన్ టౌన్ పీఎస్‌లో రికార్డుల పరిశీలించారు.లోక్ అదాలత్‌లో రాజీ తర్వాత..పరకామణి లెక్కింపులో చోరీ చేసిన రవికుమార్..టీటీడీకి రూ.14 కోట్ల విలువైన ఆస్తులను విరాళంగా ఇచ్చినట్లు గుర్తించారు. అయితే రాజీ ద్వారా నిందితుడిపై చర్యలు నిలిపివేయడమే పెద్ద వివాదం అవుతోంది. ఈ విషయంపై ఇప్పటికే టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాశ్‌రెడ్డి ఈ మధ్యే ప్రెస్‌మీట్ పెట్టి మరీ అప్పటి టీటీడీ పెద్దలపై అలిగేషన్స్ చేశారు. స్వామివారి సొమ్మును స్వాహా చేస్తే చర్యలు తీసుకోకుండా..ప్రైవేటుగా సెటిల్ చేయడమేంటి..అలా చేయడానికి మీకు ఎవరు అధికారం ఇచ్చారని ప్రశ్నించారు.శ్రీవారి హుండీని దొంగతనం చేసిన రవికుమార్ అనే వ్యక్తిని కోర్టులో నిందితుడిగా ప్రవేశపెట్టకుండానే..లోక్ అదాలత్‌లో రాజీచేయడం, అతడు చోరీ చేస్తుండగా సీసీ పుటేజీకి చిక్కడం వంటి బలమైన ఆధారాలు ఉన్నా చర్యలు తీసుకోకపోవడంపై కూటమి పెద్దలు డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు.

దాదాపు రూ.వంద కోట్ల వరకు శ్రీవారి హుండీ నుంచి దోచేశారని, 40 కోట్ల రూపాయల విలువైన ఆస్తులను బినామీ పేర్లతో రాయించుకున్నారని..భూమన కరుణాకర్‌రెడ్డి టార్గెట్‌గా అలిగేషన్స్ చేస్తున్నారు కూటమి నేతలుఆ మధ్య టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి బయటపెట్టిన వీడియోతో తిరుమల వేదికగా రాజకీయం మరోసారి వేడెక్కింది. అయితే తన మీద వచ్చిన ఆరోపణలపై భూమన కరుణాకర్‌రెడ్డి కూడా సీరియస్‌గానే రియాక్ట్ అయ్యారు. తాను టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు పరకామణిలో దొంగతనం జరిగినట్లు నిరూపిస్తే తల నరుక్కుంటానని సవాల్ చేశారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే రవికుమార్ శ్రీవారి హుండీ లెక్కింపులో దొంగతనం చేశారని భూమన అంటున్నారు.రవికుమార్ కుటుంబ సభ్యులు పాప పరిహారంగా తమ ఆస్తులను టీటీడీకి రాసిచ్చారని చెప్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే పరకామణి చోరీ జరిగిందని..రవికుమార్ అనే వ్యక్తి వెనుక వైసీపీ నేతల హస్తం ఉందని కూటమి ఆరోపిస్తోంది. ఒక ఉద్యోగి టీటీడీకి రూ.14కోట్లు రాసిచ్చారంటే..శ్రీవారి ఖజానా నుంచి ఎంత కొట్టేశారో అర్థం చేసుకోవచ్చంటున్నారు.పైగా రవికుమార్ నుంచి అప్పుడు టీటీడీలో కీలకంగా ఉన్న నేతలు ఆస్తులు రాయించుకున్నారని కూడా ఆరోపిస్తున్నారు. ఇప్పుడు సీఐడీ విచారణతో ఇది ఎవరికి మెడకు చుట్టుకుంటుందోనన్న టెన్షన్ మొదలైంది. ఇప్పటికే రోజుకో ఇష్యూ ఏపీ పాలిటిక్స్‌ను షేక్ చేస్తోంది. ఇప్పుడు పరకామణి ఎపిసోడ్ ఎటు దారితీయబోతోంతో..ఎవరెవరు బుక్ అవుతారో వేచి చూడాలి మరి.

# పవన్.. స్వపక్షంలో విపక్షం



**కాకినాడ, సూర్య వాస్తవం, అక్టోబరు 16 :** పవన్ కల్యాణ్.. హీరోగా..ఓ పొలిటీషియన్‌గా ఈ పేరే ఓ బ్రాండ్. పార్టీ పెట్టి పదేళ్లు పోరాడిన పవన్..అప్పట్లో వైసీపీ ప్రభుత్వ తీరుపై ఓ రేంజ్‌లో మండిపడేవారు. ఎప్పటికప్పుడు సమస్యలను ఎక్స్‌పోజ్ చేస్తూ..ప్రశ్నించే గళంగా ప్రజల మన్ననలను పొందారు పవర్ స్టార్. ఇప్పుడాయన ఫ్యూర్ పొలిటిషయన్. అయినా సరే తానేం మారలేదంటున్నారు పవన్. ఎప్పుడూ ప్రజల పక్షామే..జనం సమస్యే తన ఎజెండా అన్నట్లుగా కూటమి ప్రభుత్వంలో అపోజిషన్ పాత్ర పోషిస్తున్నారుఏ చిన్న అంశమైన విపక్ష వైసీపీ కంటే పవన్ స్పందిస్తున్నారు. ఉపముఖ్యమంత్రి హోదాలో ఎక్కడికి వెళ్లినా ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పవన్..వాటి పరిష్కారంపై స్పెషల్ కాన్సంట్రేషన్ పెడుతున్నారు. లేటెస్ట్‌గా కాకినాడ జిల్లాలో సముద్ర కాలుష్యంపై క్షేత్రస్థాయి పర్యటన చేసిన పవన్..పీసీబీ అధికారులతో సమీక్షించి కాలుష్యం నివారణకు పకడ్బందీ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. ఉప్పాడ మత్స్యకారుల సమస్యలను పరిష్కరించేందుకు టైమ్ బాండ్ ఫిక్స్ చేసుకున్నారు. సమస్యలను పరిష్కరించలేని నాడు రాజకీయాల నుంచి తప్పుకుంటానంటూ బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చి చర్చకు దారి తీశారు.ఇక మంత్రివర్గ సమావేశంలో లులు గ్రూప్ విషయంలో ఏకంగా ప్రశ్నల వర్షమే కురిపించారు పవన్. లులు గ్రూప్ పెట్టే కండిషన్లతో ఏపీకి వచ్చే పెట్టుబడులు ఎన్ని.? ఇచ్చే ఉపాధి ఎంత అనే అంశాలపై ఆయన అధికారులను ప్రశ్నిలు వేస్తూ ఉక్కిరి బిక్కిరి చేసేశారట. ఎంతో విలువైన భూముల ఇస్తే ఆ పరిశ్రమలు ద్వారా స్థానికులకు వచ్చే లబ్ది ఎంత అనేదానిపై పవన్ వాయిస్ రేజ్ చేశారట. ఇక ఉచిత పథకాలు ఎవరికి.? ఎందుకు? అనే కోణంలో పవన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి.ఏపీలో యువత ఉచితాలు, సంక్షేమ పథకాలు అడగడం లేదు..25 సంవత్సరాల భవితను కోరుకుంటున్నారని పవన్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. అయితే రాష్ట్ర సర్కారులో కీలక భాగస్వామిగా ఉన్న పవన్..ఉచిత పథకాలు ఎవరూ కోరుకోవడం లేదని చెప్పడం విమర్శలకు దారితీసింది. అయితే తన అభిప్రాయాన్ని ఓపెన్‌గా చెప్పేయడం పవన్ నైజం. అధికారంలోకి వచ్చిన కొత్తలో కాకినాడ రేషన్ బియ్యం ఇష్యూలో సీజ్ ది షిప్ అని అందరి దృష్టిని ఆకర్షించారు.పవన్ వ్యాఖ్యలు కూటమిలో అసంతృప్తి రాగం అన్నట్లుగానే బయటికి కనిపిస్తున్నాయి. కానీ పవన్ కల్యాణ్ రూటెప్పుడు సెపరేటు. ఆయనకు వామపక్ష భావజాలం అంటే ఇష్టం. చేగువేరా సిద్ధాంతాలను తన ప్రసంగాల్లో ప్రస్తావిస్తూ..నిత్యం ప్రశ్నించే గళంగా ఉండేందుకు ఇష్టం పడతారు. ఇప్పుడు అధికారంలో ఉన్నా..కొన్ని విషయాల్లో ప్రజా కోణంలో..ఓపెన్‌గానే తన అభిప్రాయాన్ని చెప్పేస్తున్నారు. సేనాని కామెంట్స్‌ను వైసీపీ అస్త్రంగా మల్చుకునే ప్రయత్నం చేస్తోంది. అధికారంలో ఉండి..పైగా కూటమిలో భాగస్వామిగా కొనసాగుతూ..పవన్ ఫ్యూచర్ బేస్డ్‌గానే వాయిస్ రేజ్ చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. రేపటి రోజున ఏదైనా ఇష్యూపై చర్చ జరిగినప్పుడు తాను అప్పుడే వ్యతిరేకించానని చెప్పుకునేందుకు..పైగా ప్రభుత్వంలో ఉన్నా తాను మౌనంగా లేనని చెప్పేందుకే ఎప్పటికప్పుడు తన ఒపీనియస్ వ్యక్తం చేస్తున్నారట.ప్రభుత్వాన్ని మేలుకొలిపేలా..పవన్ తన అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారనే చర్చకు జరుగుతోంది. ప్రభుత్వం తరఫున బాధ్యతాయుతమైన నాయకుడిగా.. డిప్యూటీ సీఎం హోదాలోనే రెస్పాండ్ అవుతున్నారే తప్ప..కూటమిలో అసంతృప్తి అనో..మరో రకంగానే డైవర్ట్ చేయాల్సిన అవసరం లేదంటున్నాయి జనసేన వర్గాలు. ఏదేమైనా పవన్ ప్రశ్నించే గళంగానే ఉంటుండటం ఆసక్తిరేపుతోంది.

# రెగ్యులర్ ఎపిసోడ్‌లాగా రుషికొండ భవనాలు

**విశాఖపట్టణం, సూర్య వాస్తవం, అక్టోబరు 16 :** ఎన్నికలకు ముందు అదే రచ్చ. ఎన్నికలు అయిపోయి..15 నెలలు అవుతున్నా..ఆ భవనాల చుట్టే ఏపీ పాలిటిక్స్ చక్కర్లు కొడుతున్నాయి. ఆ కట్టడాలు వైసీపీకి చేయాల్సినంత డ్యామేజ్ చేశాయి. కూటమికి కావాల్సిన ప్లస్ పాయింట్‌గా మారాయి. అయినా ఇప్పటివరకు రుషికొండ భవనాలు రెగ్యులర్ ఎపిసోడ్‌లాగా ఉండిపోతున్నాయి. ప్రతీ నెల రోజులకోసారి ఏదో విధంగా సాగరతీరంలో వైసీపీ హయాంలో కొండను తవ్వేసి కట్టిన కట్టడాల మీదే డిస్కషన్ నడుస్తోంది.ఇప్పుడు మరోసారిలైమ్‌లైట్‌లోకి వచ్చేసింది రుషికొండ ఇష్యూ. విశాఖ సాగర తీరాన వైసీపీ హయాంలో కట్టిన రుషికొండ భవనాల రచ్చ క్లైమాక్స్‌కు చేరేలా కనిపిస్తోంది. సర్కార్ క్యాబినెట్ సబ్‌కమిటీ చర్చలు స్టార్ట్ చేయడంతో..రుషికొండ నిర్మాణాలను దేనికి యూజ్ చేస్తారనే దానిపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. రుషికొండ భవనాలను ఏపీ సర్కార్ ఏం చేయబోతోంది?ప్రభుత్వమే వాడుకుంటుందా? రిసార్టులు, హోటల్స్ కోసం రెంట్‌కు ఇస్తారా? సబ్ కమిటీ సూచనలు ఎలా ఉండబోతున్నాయి? అనేది ఉత్కంఠ రేపుతోంది. ఇదంతా ఇలా ఉండగానే రుషికొండ భవనాలను మెంటల్ హాస్పిటల్‌గా మార్చాలని గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు వంటి వాళ్లు ప్రతిపాదించడం హాట్ టాపిక్ అవుతోంది.మంత్రివర్గ ఉపసంఘం భేటీ అయ్యి.. రుషికొండ భవనాలను ఏ విధంగా వినియోగించుకోవాలనే దానిపై చర్చించింది. ఎలాంటి ఉపయోగం లేకుండా ఉన్న రుషికొండ కట్టడాలతో నెలకు రూ.25 లక్షలు విద్యుత్ ఛార్జీలు, మెయింటనెన్స్ ఖర్చులు భరించాల్సి వస్తోందని చెబుతోంది ప్రభుత్వం. గతంలో రూ.7 కోట్లు ఆదాయం వచ్చే చోట ఇప్పుడు ప్రభుత్వం ఎదురు చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు మంత్రులు. రుషికొండ ప్యాలెస్ వినియోగంపై ప్రజాభిప్రాయాలు కోరుతూ ప్రకటన ఇవ్వాలని, ప్రజల అభిప్రాయం ప్రకారం డెసిషన్ తీసుకోవాలి క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. హోటల్స్ నిర్వహణ, మానసిక వికలాంగుల చికిత్సాలయ ఏర్పాటు చేయాలంటూ వచ్చిన ప్రతిపాదనలు, సలహాలను మంత్రివర్గ ఉపసంఘం పరిశీలిస్తోందట. అయితే ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాతే రుషికొండ భవనాలపై ఓ నిర్ణయానికి రావాలని భావిస్తున్నారట.రుషికొండ భవనాలను విషయంలో కూటమి టార్గెట్‌గా వైసీపీ. జగన్ ఫ్యామిలీ సాగర తీరంలో సేద తీరేందుకు..అద్భుతమైన ప్యాలెస్ కట్టారని ముందు నుంచి ఆరోపిస్తూ వస్తోంది కూటమి. అందులో బాత్ టబ్‌లు, లైటింగ్ అరేంజ్‌మెంట్స్..సీ వ్యూ..అంతా జగన్ ఇష్ట ప్రకారం..అతని కుటుంబ సౌఖ్యం కోసం నిర్మించారని విమర్శిస్తున్నారు. ఈ అలిగేషన్స్‌ను తిప్పికొట్టడంతో వైసీపీ ఇప్పటికీ ఫెయిల్ అవుతూ వస్తూనే ఉంది.ఈ క్రమంలో అదే రుషికొండ భవనాలను అస్త్రంగా చేసుకుని జగన్‌ను, వైసీపీని సందర్భం దొరికినప్పుడల్లా ర్యాగింగ్ చేస్తున్నాయి కూటమి పార్టీలు. పైగా మెంటల్ హాస్పిటల్‌గా మారుస్తామన్న ప్రతిపాదనను తెరమీదకు తెచ్చి ఇండైరెక్టుగా జగన్‌ను టార్గెట్ చేస్తోంది. ఇప్పుడు రుషికొండ భవనాలను మెంటల్ హాస్పిటల్‌గా మారుస్తామన్న టాక్‌తో..మళ్లీ జగన్‌ను ర్యాగింగ్ చేస్తోంది కూటమి. రుషికొండ భవనాలపై ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉండబోతుందో.. రియాక్షన్ ఏంటో చూడాలి మరి.

# ఓటు చోరీ తరహాలో.. చంద్రబాబుది క్రెడిట్ చోరీ

**16 ఏళ్లు సీఎంగా బాబు సాధించిందేమిటి ? - వైయస్.జగన్ హయాంలో డేటా సెంటర్ ఏర్పాటు**

**నకిలీ మద్యం తయారీలో టీడీపీ నేతలున్నా .. అడ్డంగా బుకాయింపు**

**మా పార్టీ నేతలకు నకిలీ మకిలీ అంటించే ప్రయత్నం దారుణం -ఇది ముమ్మాటికీ డైవర్షన్ రాజకీయమే**

**వైయస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి**

**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** ఇతరులు చేసిన పనికి క్రెడిట్ తీసుకోవడం చంద్రబాబుకు మొదటి నుంచీ అలవాటేనని, ఓటు చోరీ తరహాలో చంద్రబాబుది క్రెడిట్ చోరీ అని వైయస్సార్‌సీపీ జనరల్ సెక్రటరీ గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అభివృద్ధి అనేది నిరం తర ప్రక్రియ అని.. అది ఎవరి హయాంలో జరిగినా... అంతా నా వల్లే అనడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మండిపడ్డారు. వైయస్.జగన్ హయాంలోనే డేటా సెంటర్‌కి శ్రీకారం చుట్టామన్న ఆయన.. కేవలం డేటా సెంటర్ వల్ల గరిష్టంగా ఉద్యోగాలు రావన్న ఉద్దేశంతో వాటికి అనుబం ధంగా ఐటీ పరిశ్రమలు కూడా ఏర్పాటుచేయాలన్న షర తులు కూడా విధించామన్నారు. టీడీపీ, చంద్రబాబు కంటే ముందుకూడా రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని గుర్తించుకోవా లని సూచించారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

**నేదురుమల్లి హయాంలో హైటెక్ సిటీ :** ఆంధ్ర రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పుట్టక ముందు, తాను ముఖ్యమంత్రి కాకముందు ఎలాంటి అభివృద్ధి జరిగిందన్న విషయాన్ని మర్చిపోయి ఎక్కడ, ఏం జరిగినా అది నేను, నా వల్లే అన్న అంటూ.. తాను ఏర్పాటు చేసుకున్న నారావారి మీడియాతో ప్రమోట్ చేసుకోవడం చంద్రబాబుకు అలవాటుగా మారింది. విశాఖలో డేటా సెంటర్ గురించి మాట్లాడుతూ.. దాన్ని ఎప్పుడు మెటీరియలైజ్ చేశారు, జీవో ఎప్పుడు ఇచ్చారన్నది కూడా తెలుసుకోకుండా, గతంలో ఏం జరిగిం దన్నది ప్రస్తావించకుండా అంతా నా వల్లే అన్న రీతిలో మాట్లాడుతున్నారు. 1992లో నేదురుమల్లి జనార్ధనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైటెక్ సిటీకి శంకుస్థాపన చేశారు. అది నేను కట్టానని చంద్రబాబు చెప్పుకుంటూ వచ్చాడు. 2004 తర్వాత హైదరాబాద్ ఎంత అభివృద్ధి చెం దిందీ.. రాజశేఖర్‌రెడ్డితోపాటు మిగిలిన నేతలు ఏ స్థాయిలో అభివృద్ధి చేశారన్నది ఆయన ఏ రోజూ ఆలోచన చేయడు.

**అభివృద్ధి నిరంతర ప్రక్రియ..:** అభివృద్ధి అనేది ఓ నిరంతర ప్రక్రియ. 1956 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీలం సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, దామోదర సంజీవయ్య వంటి గొప్పవ్యక్తులు ముఖ్య మంత్రులుగా పనిచేశారు. ఆ టైంలో వ్యవసాయం ప్రధానం. వాళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఆ పదవి నుంచి తప్పుకున్న తర్వాత కూడా మేమేం అంతా చేశామని చెప్పుకున్న పరిస్థితి లేదు. వాళ్ల హయాంలోనే ఆంధ్రప్రదేశ్ అత్యధిక ఆహారధాన్యాల ఉత్పత్తితో అన్నపూర్ణగా ఖ్యాతి పొందింది. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ప్పుడు ప్రాణహిత, చేవెళ్ల, నెట్టెంపాడు ప్రాజెక్టులు తెలం గాణాలోనూ, ఏపీలో పోలవరం ప్రాజెక్టకు అన్ని అను మతులు తీసుకువచ్చారు. శంషాబాద్ అంతర్జాతీయ విమా నాశ్రయం, అవుటర్ రింగ్ రోడ్డు, పీవీ నరసింహారావు ఎక్స్ ప్రెస్ హైవే వంటివి వైయస్ రాజశేఖర రెడ్డి తీసుకొచ్చారు. ఐటీని కూడా బూమ్ లోకి తీసుకొచ్చారు. ఇప్పుడు మా నాన్న మైక్రోసాఫ్ట్ తెచ్చాడు. నేను గూగుల్ తెచ్చానని లోకేష్ మాట్లాడుతున్నాడు. ఐటీలో కర్ణాటక రాజధాని బెంగళూరు కాంట్రిబ్యూషన్ చాలా ఎక్కువ. వాస్తవానికి కర్ణాటకలో ఎస్ ఎస్ కృష్ణగారు, ఏపీలో చంద్రబాబు ఒకేసారి ముఖ్యమంత్రి అయ్యారు. మరి ఆయన నావల్లే బెంగళూరుకు ఐటీకి వచ్చిందని చెప్పలేదు. ఇవాళ ఐటీ ఎక్స్‌పోర్ట్స్ 210 బిలియన్ డాలర్లు ఉంటే అందులో బెంగళూరు వాటా 80 బిలియన్ డాలర్లు అంటే 40 శాతం వాటా అంటే దాదాపు రూ.7లక్షల కోట్లు వస్తుంది. తర్వాత హైదరాబాద్ రూ.1.3లక్షల కోట్లు ఉంది. ఎంత తేడా ఉంది. కానీ అక్కడ ఏ నాయకుడు మేమే ఐటీకి ఆద్యులమని మాట్లాడలేదు. ఆ తర్వాత స్థానాల్లో పుణే, చెన్నై, ముంబాయి, గుర్ గావ్ ఉన్నాయి. మరి హైదరాబాద్ కంటే ఎక్కువ కాంట్రిబ్యూషన్ చేసిన చోట్ల అక్కడ నాయకులు చంద్రబాబులా నేనే అని చెప్పుకోలేదన్న సంగతి తెలుసుకోవాలి.

**సీఎంగా చంద్రబాబు ఫెయిల్యూర్స్:** దాదాపు 16 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా చంద్రబాబు పనిచేశారు. ఆయన హయాం కంటే వైయస్సార్, కేసిఆర్ హయాంలోనే ఐటీ ఎగుమతులు పెరిగాయి. ఐటీ కాకుండా ఎలక్ట్రానిక్స్ లో మనమెక్కడున్నమో చూస్తే.. మనకన్నా తమిళనాడు ముం దుంది. మనం కనీసం పదో స్థానంలో కూడా లేము. ఇక మిగిలిన సర్వీస్ ఎక్స్ పోర్ట్స్ లో కూడా మనం ముందులేం. గుజరాత్ 155 మిలియన్ డాలర్లు ఉంటే, మహారాష్ట్ర 138, కర్ణాటక 113, తమిళనాడు 75 బిలియన్ డాలర్లు ఉంటే, తీర ప్రాంతం లేని తెలంగాణాలో 55 బిలియన్ డాలర్లు ఎక్స్ పోర్ట్స్ ఉంటే సుమారు వేయి కిలోమీటర్ల తీర ప్రాంతం ఉన్న మన రాష్ట్రంలో 24.8 బిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నాయి. ఇవన్నీ సుదీర్ఘ కాలంపాటు ముఖ్యమంత్రిగా **పనిచేసిన మీ ఫెయిల్యూర్స్ కాదా ?:** రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా మీరు మఖ్యమంత్రిగా చేసి రాష్ట్రానికి ఏం చేయకుండా కాలాన్నివృధా చేశారు. వైయస్.జగన్ ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు కరోనా వంటి విపత్తులు వచ్చినా కూడా టీసీఎస్ వంటి సంస్థలతో ఒప్పందం చేసుకున్నారు. 2021లో ఆదానీ డేటా సెంటర్ కోసం జీవో కూడా ఇచ్చాం. కేవలం డేటా సెంటర్ పెడితే దానివల్ల ఉద్యోగాలు రావు... దీనివల్ల పెట్టుబడులు రూపంలో రూ. 10 నుంచి రూ.20 వేల కోట్లు పెట్టుబడులు కనిపిస్తున్నాయి, ఉద్యోగాలు 1000 లోపే ఉన్నాయి.కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం అనేకరకాలుగా ప్రోత్సాహకాలు ఇస్తున్న నేపథ్యంలో.. ఐటీ పార్క్ వంటివి అభివృద్ధి చేయాలని నిబంధనలు పెట్టి ఆదాని కి ఇవ్వడం జరిగింది.

**వైయస్.జగన్ హయాంలోనే ఆదానీ డేటా సెంటర్:** ఇవాల మీ అనుకూల మీడియా ద్వారా మొత్తం చంద్రబాబే చేస్తున్నారని చెబుతున్నారు. గూగుల్ ని ఆదాని, ఎయిర్ టెల్ భాగస్వామ్యం చేస్తున్నాయి. స్ట్రాటజికల్ లొకేషన్ లో వైజాగ్ ఉన్నందున సీ కోస్ట్ లో కేబుల్ పనులు ఎయిర్ టెల్ చూస్తుంది. ఇదంతా గతంలోనే జరిగింది. ప్రాజెక్టు 1, ప్రాజెక్టు 2 పేరుతో మధురవాడలో 130 ఎకరాలు, కాపులుప్పాడ స్థలం ఇచ్చారు. డేటా సెంటర్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు ఎక్కువగా రావడం లేదు కాబట్టి.. గరిష్టంగా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉన్న ఐటీ పార్క్ కూడా ఏర్పాటు చేయాలని వైయస్.జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వాటికి శంకుస్థాపన చేస్తూ.. కండిషన్ కూడా పెట్టారు. కానీ చంద్రబాబు మాత్రం అంతా నేనే అని చెబుతారు. ఓటు చోరీ తరహాలో చంద్రబాబుది క్రెడిట్ చోరీ. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. ఇంకా నేనే ఫోన్ కనిపెట్టానని చెప్పడం విడ్డూరం. ఆఫ్రికా ఒకప్పుడు నాగిరికతకు దూరంగా ఉన్న ప్రాంతాలు.. నేడు అక్కడ కూడా టెక్నాలజీ అడ్వాన్స్ గా ఉంది. 90లో చైనాది, మన దేశానికి ఒకటే జీడీపీ, ఇవాళ పోలిక లేకుండా పోయింది. సౌత్ అమెరికా,ఆఫ్రికా దేశాలు కూడా టెక్నాలజీలో మనకంటే మందుకు పోతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో క్రమశిక్షణ ఎలా ఉంది, ప్రజలుఎలా కమిట్‌మెంట్ తో ఉంటారో అది అలవాడు చేసుకొండి. ప్రజలను ఆ దిశగా నడిపించాలి. అలా కాకుండా నిరంతరం తప్పుడు ప్రచారం చేయడం,ప్రతిపక్ష పార్టీలను నిర్లక్ష్యం చేయడం, వారిని అణగద్రొక్కడంతో పాటు ప్రజలకేం చేయకపోయినా బృందాలను ఏర్పాటు చేసి.. ప్రచారం చేసుకుంటూ మాఫియాలా నడిపే వ్యక్తి చంద్రబాబు. ఇది ప్రజాస్వా మ్యంలో సరికాదు. నిర్దిష్టంగా ఎన్ని ఉద్యోగాలు వస్తాయని చెప్పలేని పరిస్థితి మీది. ఆసియాలో అత్యంత పెద్ద సెజ్ శ్రీసిటీ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వచ్చింది. దాన్ని వైయస్ జగన్ హయంలో మరింత ముందుకు తీసుకెళ్లారు. టీసీఎస్ లాంటి పరిశ్రమలు ఆయన హయాంలోనే వచ్చాయి. పాక్షికంగా ఏదో వస్తుందని చెప్పడం కాదు. వచ్చే దాన్ని స్వాగతించాలి.. కానీ భవిష్యత్తులో ఎంత నీరు, విద్యుత్ అవసరం, దానివల్ల మన మీద ఇంపాక్ట్స్ ఏమున్నాయన్నది ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మీదే. ఎప్పటిలోగా పూర్తవుతుంది, ఎన్ని ఉద్యోగాలు వస్తాయన్నది చెప్పకుండా .. మేమే ఆద్యులం అని చెప్పుకుంటున్నారు. నిరంతరం బురద జల్లడానికే ప్రయత్నిస్తున్నారే. మేం పరిశ్రమలకు వ్యతిరేకం కాదు. మేం వైజాగ్ అయితేనే ఈ రాష్ట్రానికి ఆదాయ వనరుగా ఉంటుందని మేం చెబితే... వైజాగ్ మీద వ్యతిరేక కథనాలు రాయించారు. సునామీ వస్తుందని అంతా మునిగిపోయే చోట బిల్డింగ్ లు కడతారట అంటూ వ్యతిరేక కథనాలు రాయించారు. దుర్మార్గంగా వ్యవహరిం చింది మీరా ? మేమా ? మంచి ఉద్యోగాలు రావాలంటే ప్రభుత్వ స్కూళ్లలో కూడా ఫౌండేషన్ స్థాయి నుంచి విద్యలో ప్రమాణాలు ఉండాలనే ఉద్దేశంతో టోఫెల్‌ని ప్రవేశపెట్టడం, ఇంగ్లిషు మీడియంతో డిజిటల్ క్లాసురూములు వంటివి ఏర్పాటు చేశాం. ఈ ఆలోచన చేసింది వైయస్.జగన్ మాత్రమే. అంతే తప్ప నీలా గాలికొచ్చిన క్రెడిట్ తీసుకుని అంతా నేనే అని భ్రమింపజేసే రకం కాదు.



**వైయస్.జగన్ హయాంలోనే నిజమైన అభివృద్ధి:** మీరే విజనరీ అని మీ అనుకూల పత్రికల్లో చెప్పుకోవడం చంద్రబాబుకు అలవాటు. కానీ ఆచరణలో చేసి చూపించిన వ్యక్తులు మాత్రం వైయస్.రాజశేఖర్ రెడ్డి, వైయస్.జగన్ మాత్రమే. ఉత్తరాంధ్రాలో మూలపేటతో పాటు, రామాయపట్నం, బందరు పోర్టులను వైయస్.జగన్ హయాంలో అభివృద్ధి చేసారు. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు లేదా ఫిషింగ్ హార్బరు ఉండాలని ప్లాన్ చేశారు. సుమారు 1000 కిలోమీ టర్ల పొడవైన తీర ప్రాంత అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక వేశారు. దీనికి మీరు ఆద్యులా? ఎన్నో ఏళ్ల నుంచి బందరు పోర్టు గురించి చంద్రబాబు హామీలివ్వడంతప్ప పని చేసిం దేమీ లేదు. వైయస్.జగన్ హయాంలోనే ఈపోర్టు నిర్మాణం కోసం.. నాబార్డ్‌తో టైఅప్‌చేసి బందరు పోర్టును యుద్దప్రాతి పదికన పూర్తి చేయాలని నిర్ణయించాం. అది దాదాపు పూర్తయింది. రామాయపట్నం పోర్టులో ఒకటిరెండు నెలల్లో కార్యకలాపాలు మొదలుకానున్నాయి. ఇవన్నీ చేసింది వైయస్.జగన్ హయాంలోనే.

**అభివృద్ధిపై చర్చకు సిద్ధం:** పేదవాడి ఆరోగ్యం కోసం 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, 5 మెడికల్ కాలేజీలను పూర్తి చేసిన ఘనత వైయస్.జగన్ దే. మిగిలిన కాలేజీల్లో మరో 5 తరగతులకు సిద్ధంగా ఉండగా... మిగిలినవి వివిధ దశలలో నిర్మాణంలో ఉంటే... మీరు చేసిన దుష్ప్రచారం ఏమిటి? ఒక్క మెడికల్ కాలేజీ కూడా కట్టలేదని మాట్లాడారు. ఇదా మీ విజన్? పోర్టుల ఏర్పాటుకు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి, 50వేల ప్రభుత్వ స్కూళ్లలో నాడు నేడు ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించి సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది కేవలం వైయస్.జగన్ మాత్రమే. నియోజకవర్గ కేంద్రాల్లోని సీహెచ్ సీలలో జిల్లా కేంద్రాల్లోని జిల్లా ఆసుపత్రుల్లో జీరో వేకెన్సీ పాలసీతో సిబ్బంది కొరత లేకుండా చూసింది కూడా జగన్ మాత్రమే. మీరు దేని గురించి చర్చకు వచ్చినా మేం సిద్ధమే.

**చంద్రబాబుది ప్రచార పిచ్చి:** ఏ వ్యక్తి అయినా ప్రజలకు మంచి చేయాలని తపిస్తాడే తప్ప.. మీలా ప్రచార పిచ్చితో పనిచేయడు. దావోస్ లో లక్షల కోట్ల ఒప్పందాలు అని చెప్పారు. కార్యరూపంలో ఒక్కటీ కనిపించలేదు. బాధ్యతగల ప్రజా ప్రతినిధిగా ప్రజలకు మంచి జరుగుతుంది అంటే ఎంత కష్టపడ్డానికైనా సిద్దంగా ఉంటాం. కానీ చేసే పని తక్కువ ప్రచారం ఎక్కువ చేసుకుని లక్షణం మాత్రం నీదే చంద్రబాబూ. చేయని పనికి ప్రచారం చేసుకోవడం నీ లక్షణం. మా హయాంలో విధ్వంసం జరిగిందని పదే, పదే దుష్ప్రచారం చేస్తున్నావు. వాస్తవానికి ప్రజలకు ఎవరు మంచి చేశారు? పేదవాడి ముంగిటికే అన్ని సేవలు అందా లన్న మంచి లక్ష్యంతో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వారికి అన్ని ప్రభుత్వ సేవలు అందించింది ఎవరు? ప్రతి గ్రామంలో హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసింది ఎవరు ? రైతులకు ఇబ్బందికి రాకుండా ఆర్బీకేల ద్వారా విత్తనం నుంచి విక్రయం వరకు వారిని చేయిపట్టుకుని నడిపించింది ఎవరు? ఎరువులు సైతం ప్రతి గ్రామంలోనూ రైతుకు అందుబాటులోకి తీసుకువచ్చింది ఎవరు? వ్యవస్థలను పూర్తిగా సామాన్యుడికి అందుబాటులోకి తీసుకొచ్చింది కేవలం వైయస్.జగన్ మాత్రమే.

**మీడియా బలంతో నెగ్గుకొస్తున్న బాబు:** నారావారి మీడియా మీకున్న ఏకైక బలం. ఆ మీడియా మేనేజిమెంట్ తోనే మీరునెగ్గుకు వస్తున్నారు. మేం అన్నిఅభివృద్ధి కార్యక్రమా లకు సహకారం అందిస్తాం.అయితే డేటా సెంటర్ ఏర్పాటులో మా భాగస్వామ్యం కూడా ఉందన్నది ప్రజలకు తెలియాల్సిన బాధ్యత మాపై ఉంది. ఇవాల కేంద్రంతో భాగ స్వామిగా ఉన్న చంద్రబాబు వారందరినీ బైపాస్ చేసి అంతా తానే అని చెప్పుకుంటున్నాడు. 2014-19 మధ్యలో అధికా రంలో ఉండి కూడా భోగాపురం అంతర్జాతీయ విమానా శ్రయ నిర్మాణానికి కావాల్సిన అనుమతులన్నీ చంద్రబాబు పెండింగ్‌లో పెట్టి వెళ్లిపోతే.. అన్ని అనుమతులు తీసుకొచ్చి దాని నిర్మాణాన్ని ఒక కొలిక్కి తెచ్చింది వైయస్.జగన్ ప్రభుత్వమే. ఆ రోజు చంద్రబాబు హైదారబాద్ తో పాటు విశాఖపట్నంలో కూడా ఐటీ కంపెనీలు పెట్టాలన్న ఆలోచన కనీసం చేయలేదు. దివంగత నేత వైయస్.రాజశేఖర్ రెడ్డి పుణ్యంతోనే విశాఖకు ఐటీ కంపెనీలు వచ్చాయి.

**డైవర్షన్ పాలిటిక్స్:** మీ ఆధ్వర్యంలో లా అండ్ ఆర్డర్ అత్యంత అధ్వాన్నంగా ఉంది. నకిలీ మద్యం వ్యవహారంలో మీ పార్టీ నేతలే డైరెక్ట్ గా పట్టుబడి మరలా వైయస్సార్‌సీపీ నేతలపై బురద జల్లుతున్నారు. వివేకానంద రెడ్డి హత్య గురించి ఏం జరిగిందో ప్రజలకు పబ్లిక్‌గా చెప్పండి. అంతే తప్ప ఇతరులపై బురద జల్లి కాలం ఆ సమయానికి కాలం గడిపే మాటలు వద్దు. ఊర్లలో పార్టీ హోర్డింగ్ పెడితేనే కేసులు పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తున్న మీ పాలనలో వైయస్సార్‌సీపీ నేతలు నకిలీ మద్యం తయారు చేసే ధైర్యం చేస్తారా ? కేవలం మీ పై వచ్చిన ఆరోపణల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి, కుటీర పరిశ్రమ తరహాలో నకిలీ మద్యం తయారు చేసి, బెల్టు షాపుల ద్వారా ఏరులై పారిస్తున్న మీ అక్రమాలు బయటపడ్డంతోనే మా పార్టీ నేతలకు బురద అంటించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని పూర్తిగా నాశనం చేస్తూ.. దానిపై ప్రజలు ప్రశ్ని స్తుండటంతో మరలా డైవర్షన్ రాజకీయాలు పాల్పడుతు న్నారు. మీకు ధైర్యం, చిత్తుశుద్ధి ఉంటే ప్రతిపక్ష పార్టీగా మేం అడిగే ప్రశ్నలకు బదులివ్వాలే తప్ప తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయవద్దు. డేటా సెంటర్ ఏర్పాటుపై అన్ని జీవోలు మా హయాంలో ఇచ్చాం. కేవలం డేటా సెంటర్ తోపాటు ఐటీ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు వైస్.జగన్ హయాంలోనే చొరవ తీసుకున్నాం. అభివృద్ధి అనేది నిరం తర ప్రక్రియ అన్న విషయాన్ని చంద్రబాబు గుర్తుంచు కోవాలి. ఇప్పటికైనా వేరొకరు చేసిన పనికి క్రెడిట్ తీసుకో వడం, వైయస్.జగన్ పై నిత్యం బురదజల్లడంతో పాటు మీ పార్టీ నేతలే తప్పు చేసి అడ్డంగా దొరికిపోయినా ఆ బుర దను వైయస్సార్‌సీపీ నేతలకు అంటించే ప్రయత్నం చంద్ర బాబు మానుకోవాలని శ్రీకాంత్ రెడ్డి సూచించారు.

## డబుల్ ఇంజన్ సర్కార్‌తో.. జెట్ స్పీడ్‌తో అభివృద్ధి

**దేశానికి మోదీ, రాష్ట్రానికి చంద్రబాబు ఒక వరం - గూగుల్ ఏఐ డేటా సెంటర్ దేశంలోనే ఓ ఐకాన్**

**కర్నూలులో జరిగిన సూపర్ జీఎస్టీ సభలో ఎమ్మెల్యే దగ్గుపాటి**

**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రంలో జెట్ స్పీడ్‌తో అభివృద్ధి జరుగుతోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. కర్నూలు జిల్లాలో జరిగిన సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఇప్పటికే నాలుగు రోజులుగా ప్రధాని సభ ఏర్పాట్లలో ఆయన పాల్గొన్నారు. ప్రధాని మోదీ రాయలసీమ ప్రాంతానికి రావడం చాలా సంతో షంగా ఉందన్నారు. రాయలసీమలోని పుణ్యక్షేత్రాల గురించే కాకుండా ప్రజల గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించార న్నారు. భారత దేశానికి ప్రధాన మంత్రి మోదీ, ఏపీకి ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక వరం లాంటివారన్నారు. వారు ప్రతి నిత్యం అభివృద్ధి కోసం పరితపిస్తున్న నాయకులన్నారు. అలాంటి ఇద్దరు గొప్ప నాయకులతో కలిసి ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రి నారా లోకేష్ కృషితో గూగూల్ ఏఐ డేటా సెంటర్‌ను విశాఖకు తీసుకొస్తున్నారన్నారు. ఈ సంస్థ రాకతో ఏపీకి ప్రపంచ పటంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో ప్రధాన మంత్రి సహకారంతో రాష్ట్రంలో మరిన్ని అద్భుతమైన ప్రాజెక్టులు వస్తాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు.



## కోర్తి కోటలో దోమల నివారణకు చర్యలు

**తనకల్లు, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** శ్రీ సత్య సాయి జిల్లా మండల పరిధిలోని కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల కోర్తి కోట సచివాలయం నందు గల అన్ని పల్లెల్లో మంగదిన్నేపల్లి, తోడెండ్లగట్లపల్లి, కోర్తి కోటలో దోమల నివారణకు ముందస్తుగా మలతీయాన్ పౌడర్ ను పిచికారి చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో కదిరి మలే రియా సబ్‌యూనిట్ ఆఫీసర్ డి.రామాం జులు ఆధ్వర్యంలో మలాథియాన్ పౌదర్ను ను ఫోకల్ స్ప్రే ఐఆర్ఎస్ చేయడం జరిగింది .దోమల నివారణకు 15 రోజులు ముందు ఇదే సచివాలయం నందు ఫాగింగ్ చేయడం జరిగినది. కొర్తికోట సచివాలయము లోని అన్ని పల్లెలకు పిచికారి చేయడం జరిగినది .దోమలు పిచ్చికారి చేసిన తర్వాత రెండు నెలలు గోడమీద కూర్చోకుండా వాసనకు ఇంటి లోపల రాకుండా కాపాడుతాదని తెలియజేయడం జరిగింది.ఇంటి లోపల చీకటిగా ఉన్న ప్రాంతంలో,బాత్రూమ్ లో బట్టలు విప్పి వేయడం ద్వారా దోమలు అక్కడ ఆవాసం ఉంటాయని తెలియచేయడం జరిగింది.ఈ మందు పిచికారి చెయ్యడం వలన దోమలు లేకుండా వెళ్ళిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో సబ్ యూనిట్ ఆఫీసర్ డి రామాంజులు, ఏం ఎల్ హెచ్ పి రోహిణి,హెల్త్ అసిస్టెంట్లు జి. మునల రెడ్డి, జి. మోహన్ రెడ్డి, సచివాలయ ఎఎన్ఎం వరలక్ష్మీ, సెక్రెటరీ నౌషాద్, ఆశాలు రెడ్డిశ్వరి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



## విద్య, వైద్య, శిశు సంక్షేమ శాఖల

# సమన్వయంతో సత్ఫలితాలు

### 8వ రాష్ట్రీయ పోషణ మాసం ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్





**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** విద్య, వైద్య, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేసి సత్ఫలితాలు వస్తాయని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని "ఆరోగ్యవంతమైన మహిళా - శక్తి వంతమైన కుటుంబానికి బలమైన పునాది" అనే అంశం తో సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు జిల్లా లో ఒక నెల పాటు నిర్వహించి జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాయచోటి లోని సుధా కన్వెన్షన్ హాల్ నందు మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రతి సంవత్సరం జాతీయ స్థాయిలో జరిగే పోషణ అభియాన్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం "ఆరోగ్యవంత మైన మహిళా - శక్తి వంతమైన కుటుంబానికి బలమైన పునాది" అనే అంశం పైన దాదాపు ఒక నెల నుంచి ఈ పోషణ అభియాన్ అనే కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఒక జాతీయ స్థాయి కార్యక్రమం ప్రతి సంవత్సరం ఒక నెల పాటు ఈ పోషణ అభియాన్ కార్యక్రమం జాతీయ స్థాయిలో ప్రతి రాష్ట్రంలో ప్రతి జిల్లాలో జరుపుకోవడం జరుగుతుందని, దీని ముఖ్య ఉద్దేశం ప్రతి సంవత్సరం ఒక్కొక్క థీమ్స్ మీద ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నాయని ఈ సంవత్సరం దీనికి కొన్ని థీమ్స్ సెలెక్ట్ చేయడం జరిగిందని ఇందులో భాగంగా పిల్లలలోఉబకాయం ఉండడం, మనం తినే ఆహారంలో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండడం వల్ల ఏ విధంగా ఆరోగ్య సమస్యలు రావచ్చు దీని గురించి ఈ ఇయర్ థీమ్ పెట్టడం జరిగిందని తర్వాత ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ చిన్న వయస్సులో పిల్లల్ని ఎలా బాగా చూసుకోవాలి. ఏ విధంగా వారికి మంచి ఎడ్యుకేషన్ మరియు ఆహారం దాన్ని మనకి ఏ విధంగా మంచి పోషణ అందిస్తుంది, దీని గురించి ఈ సంవత్సరం థీమ్ పెట్టడం జరిగింది. ఈ ఏరియాలో పండుతున్న క్రాప్స్ కానీ, కూరగాయలు, ఫ్రూట్స్ అవన్నీ మనం తింటే ఈ ఏరియాకి ఉన్న అనుకులతను వాతావరణ ప్రకారం మనకి ఒక మంచి పోషణ దీని ద్వారా దొరుకుతుందని తెలిపారు. గతంలో పార్వతీపురం, మన్యం జిల్లాలు




ఏర్పడిన తరువాత అక్కడ అనుభవాన్ని పంచుకుంటూ..అక్కడ 1000మంది పిల్లలు పుడితే వారిలో దాదాపు 25 మంది పిల్లలు పౌష్టికాహార లోపం వల్ల పుట్టిన సంవత్సరం లోపు చనిపోతున్నారని తెలియజేసారు. దీనికి రకరకాల కారణాలతో ముఖ్యంగా బరువు తక్కువుగా ఉండటం, తల్లి గర్భం దాల్చిన సమయం లో ప్రతి రోజు తీసుకునే ఆహారంలో పౌష్టికాహార లోపం మరియు వారికీ 9 నెలల పాటు అందించాల్సిన వైద్య సదుపాయాలు అందకపోవడం తదితర కారణాలే కాకుండా డెలివరి సమయం లో ప్రతి నెలలో దాదాపు మాత శిశు మరణాల సంఖ్య కూడా ఎక్కువగా ఉండటం గమనించడం జరిగిందని తెలిపారు. వీటి అన్నిటికి పరిష్కారం ఇలాంటి కార్యక్రమాలను క్రింది స్థాయికి తీసుకువెళ్లి అవగాహన కల్పించడం ముఖ్యమని తెలియజేశారు.ఇలాంటి కార్యక్రమాలను విద్యా, వైద్య, శిశు సంక్షేమ శాఖలు అతి ముఖ్యమైనవని వీరంతా కలసి సమన్వయంతో పని చేసి సత్ఫలితాలు దిశగా జిల్లాను ముందుకు తీసుకు వెళ్ళాలని సూచించారు. ఈ నెల రోజులు పాటు 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చక్కగా నిర్వహించిన జిల్లా సిబ్బంది కి మరియు అంగన్ వాడి కార్యకర్తలకు జిల్లా కలెక్టర్ వారిచే మొమెంటో లను అందించారు. అనంతరం కొంత మంది స్త్రీ లకు గర్భిని ఆహ్వానం శ్రీమంతం కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మొదటగా శిశు సంక్షేమ శాఖ వారు ఏర్పాటు చేసిన సేల్ఫీ పాయింట్ వద్ద ఫోటో తీసుకోని ఆనంతరం ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్స్ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ పిడి హైమవతి, నగరపాలక సంస్థ కమిషనర్ రవి, ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్ట్ కోటేశ్వరమ్మ, జి.సి.డి.వో మాధవి, అంగన్వాడి, ఆశా వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మనూరు జయరాం పుట్టినరోజు వేడుకలు



**పామిడి, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పుట్టినరోజును పురస్కరించుకుని పామిడి టిడిపి కార్యాలయం నందు కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మొదటగా గుమ్మనూరు జయరాం కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు,అనంతరం పలువురు ముఖ్య నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మన గుంతకల్ నియోజకవర్గానికి రావడం మన అదృష్టం అని ఈ సందర్భంగా ఆయన కర్నూలు నుండి అనంతపురం జిల్లాకు వచ్చి కేవలం 35 రోజుల్లోనే గెలిచి గుంతకల్లు నియోజకవర్గం ప్రజలలో చెరగని ముద్ర వేశారని ఈ సందర్భంగా గెలిచినప్పటి నుండి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని అందులో భాగంగానే గుత్తి పట్టణానికి చెరువుకు నీళ్లు తేవడం అలాగే 250 కోట్లతో నీటి సమస్యను తీర్చడం,ముఖ్యంగా కసాపురం దేవాలయాన్ని అభివృద్ధి బాటలో నడపడం కొన్ని ఉదాహరణలుగా చెప్పుకోవచ్చని ఇలాంటి ఎమ్మెల్యే మరిన్ని ఉన్నతమైన పదవులు అధిరోహించి ఎప్పుడు కూడా ఆయనే మనకు ఎమ్మెల్యేగా ఉండాలని ఆకాంక్షించారు అనంతరం పార్టీ ఆఫీస్ కి ఎదురుగా ఉన్న స్థలంలో అన్నదాన కార్యక్రమం పి ఆర్ కె బాబు గారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా పలువురు నాయకులు టిడిపి నాయకులు కార్యకర్తలకు స్వయంగా భోజనాలు వడ్డించి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ప్రధాని నరేంద్ర మోడీకి అభివాదం చేసిన కేఈ శ్యాం కుమార్




**పత్తికొండ టౌన్, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** ఈరోజు జరిగినటువంటి సూపర్ జీఎస్టీ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీకి కేఈ శ్యాం కుమార్ అభివాదం చేశారు. నేడు జరిగిన ప్రధాని కార్యక్రమం దిగ్విజమైనందుకు పత్తికొండ నియోజకవర్గం ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## రైతులకు మొక్కల పంపిణీ




**కుప్పం, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** ఫలసాయం ద్వారా ఆదాయాన్ని పొందేందుకు రైతులకు ఉద్యాన శాఖ అధికారులు వివిధ రకాల పండ్ల మొక్కలను గురువారం పంపిణీ చేశారు. శాంతిపురం, రామకుప్పం, కుప్పం, మండలాల్లో సుమారు 10 వేల మొక్కలను ప్రభుత్వం ద్వారా సబ్సిడీ రూపంలో రైతులకు అందిస్తోంది. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనవాసులు చేతులు మీదుగా రైతులకు ఈ మొక్కలను అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని రైతులుసద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. ఉద్యాన శాఖాధికారిణి విజయ మాట్లాడుతూ రైతులు మామిడి పంటలు వేసి చాలా మంది నష్టపోతున్నారని, అలాకాకుండా ప్రత్యామ్నాయంగా ఫలసాయాన్ని అందించే కలిమి పండ్లు లాంటి అటవీ మొక్కలను పెంచినట్లయితే మార్కెట్లో మంచి గిట్టు బాటు ధరలు అందుతాయని తెలిపారు. వాణిజ్యవిపణిలో వ్యాపారులు రైతుల దగ్గరకే వచ్చి ఈ పండ్లను కొనుగోలు చేస్తారని అన్నారు. ముఖ్యంగా అడవిలో పండే కలిమి పండ్లను బేకరీలలో వాడుతారని ఉద్యాన శాఖాధికారి విజయ తెలియచేశారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలతో రైతులను ప్రోత్సాహించే దిశగా కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉద్యాన శాఖ అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

## అనాథాశ్రమంలో అన్నదానం




**గుత్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** గుత్తి పట్టణంలోని గుంతకల్ ని యోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూ రు జయరాం జన్మదిన సందర్భంగా బోర్వెల్ నాగరాజు మరియు మోడల్ స్కూల్ కమిటీ చైర్మన్ పవన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కొత్తూరులోని అనాథ ఆశ్రమంలో అనాథ పిల్లల నడుము ఎమ్మెల్యే గుమ్మ నూరు జయరాం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ముందుగా టిడిపి నాయకులు పిల్లలు కేక్ కటింగ్ చేసి పుట్టినరోజు శు భాకాంక్షలు జయరాం అన్న అంటూ ఒకరినొకరు కేక్ తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారికి అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రతాప్, ఆస్పత్రి కమిటీ సభ్యులు చికెన్ శీను, బోర్వెల్ నాగరాజ్, మోడల్ స్కూల్ కమిటీ చైర్మన్ పవన్‌కుమార్ యాదవ్,మాజీ కౌన్సిలర్ వేణు,మాజీ కౌన్సిలర్ సుంకన్న, మైనుద్దీన్, జంగాల సుంకన్న, ఎస్ఎం బాష, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పనబాక భూలక్ష్మికి ఘన సన్మానం

**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** విజయవాడ నగరంలోని ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ మల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు, నెల్లూరు పార్ల మెంటు తెలుగుదేశం పార్టీ మహిళా అధ్య క్షురాలు పనబాక భూలక్ష్మికి నాయుడు పేట పట్టణంలోని పనబాక భూలక్ష్మి సేవా సమితి కార్యాలయంలో ఘన సన్మానం జరిగింది. శ్రీ కనకదుర్గ మల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులుగా ఆమె ఇటీవల ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో పనబాక భూలక్ష్మి, గంగాధరయ్య దంప తులను పలువురు నాయకులు సన్మానిం చారు. పనబాక భూలక్ష్మి దంపతులకు పూలమాలలు వేసి సన్మానించి శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో పి.నరసింహులు నాయుడు, ఎ.సాయి నాయుడు, కె.నరసింహులు నాయుడు, ఎ.శ్రీనివాసులు నాయుడు, జి.చిరంజీవి నాయుడు జి.శ్రీనివాసులు నాయుడు, పాస్టర్లు నిక్సన్, వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ విలేకరులకు పునశ్చరణ తరగతులు

**కనేకల్, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** అనంతపురం జిల్లా గ్రామీణ విలేకరులకు ఈనెల 17 మరియు 18 తేదీల్లో సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో రాయదుర్గంలో రెండు రోజులపాటు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. తొలి రోజు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఈ తరగతులను ప్రారంభిస్తారని, రెండవ రోజు శనివారం ముగింపు ఉత్సవంలో రాయదుర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన పాత్రికేయ ప్రముఖుల ద్వారా వివిధ అంశాలపై గ్రామీణ విలేకరులకు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విలేకరులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సి.ఆర్.మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ ఒక పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

## వృత్తిలో నైపుణ్యంతోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం (యూనివర్సిటీ క్యాంపస్), సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** మనం చేపట్టే వృత్తిలో నైపుణ్యాలను జోడించడం ద్వారా అభివృద్ధి సాధించగలమని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. గురువారం కుప్పం ద్రావిడ యూనివర్సిటీలో వేఎవా ఇనోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన (అంతరంగ శిక్షణ) ఇంటర్న్ షిప్ వర్క్ షాప్ లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ వృత్తిపరమైన అనుభవాన్ని పొందడానికి మనం పనిచేసే సంస్థలు అంతరంగ శిక్షణ ద్వారా మనలో నైపుణ్యాలను పెంచుతారని తెలిపారు. ఇంటర్న్ షిప్ ద్వారా మన కెరీర్ను పటిష్టంగా నిర్మించుకోవచ్చు అన్నారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ద్వారా బిఎస్సీ కంప్యూటర్స్, బిబిఏ ,బీకాం కంప్యూటర్స్ కు చెందిన విద్యార్థులకు ఇండస్ట్రియల్ ట్రైనింగ్స్, ఇంటర్న్ షిప్ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ద్రావిడ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కిరణ్ కుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు విజయ వర్ధిని, అకడమిక్ డీన్ కేశవ మూర్తి ,వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, తేదేపా నాయకులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, మైనార్టీ అధ్యక్షుడు జాకీర్,వేఎవా ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు ఉజ్వల్, విజ్ఞేష్, రమ్యశ్రీ,మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## బాలికల జీవన శైలిపై అవగాహన సదస్సు



**వజ్రకరూరు, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** రోజురోజుకు దేశంలో సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోతున్న తరుణంలో బాలిక అంటే కేవలం ఒక కుటుంబానికి వెలుగు కాదు, సమాజానికి భవిష్యత్తు అనిఆమె విద్యావంతురాలు అయితే మొత్తం కుటుంబం ఎదుగుతుందని, ఆమె ఆరోగ్యంగా ఉంటే ఒక తరం ఆరోగ్యంగా ఉంటుందని, అందుకే బాలికలను రక్షించడం, ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వేణుగోపాల్, ఆరోగ్య విస్తరణ అధికారి విజయకుమార్. అక్టోబర్ 11న జరుపుకునే అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, భద్రత, సమానత్వం వంటి అంశాలపై వారం రోజులపాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జడ్పీహెచ్ఎస్ స్కూల్ చిన్న హొతూర్ నందు వారు మాట్లాడుతూ బాలికకు విద్య ఇవ్వడం అంటే భవిష్యత్తు తరాలను బలపరచడం. చదువుకున్న అమ్మాయి ఆరోగ్యవంతమైన కుటుంబానికి, అభివృద్ధి చెందిన దేశానికి పునాది వేస్తుంది అన్నారు. ప్రతి తల్లిదండ్రి తమ కూతురిని తప్పకుండా పాఠశాలకు పంపాలని సూచించారు. బాలిక ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తు ఆరోగ్యంగా ఉంటుందని, ఆడపిల్ల తక్కువ అని అనుకోవడం పెద్ద తప్పు అని పేర్కొన్నారు. అవకాశం ఇస్తే ఆడపిల్ల కూడా విజ్ఞానంలో, క్రీడల్లో, నాయకత్వంలో ముందుంటుందని చెప్పారు. సమాన హక్కులు ఇవ్వడం సమాజ అభివృద్ధికి తొలి అడుగు అని పేర్కొంటూ గర్భంలోని శిశువు అబ్బాయా ఆడపిల్లా అని లింగ నిర్ధారణ తెలుసుకోవడం చట్ట విరుద్ధం అని ఇలాంటి చర్యలు సమాజంలో అసమానతకు దారి తీస్తాయి. ప్రతి పుట్టుక దేవుని వరం దానిని గౌరవించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి హెచ్ఎం , టీచర్ రజినీ, పద్మజ, ఎం ఎల్ హెచ్ పి, విజయలక్ష్మి హెల్త్ సెక్రటరీ చాముండి అంగన్వాడీ వర్కర్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో రచ్చబండ





**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని రాజంపేట నియోజకవర్గంలోని రాజంపేట మండలం శేషమాంబపురం పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లిలో రాజంపేట శాసన సభ్యులు అన్నమయ్య జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆకేపాటి అమర్ నాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా.. ముద్రించిన కరపత్రాలను, సంతకాల సేకరణ ఫారాన్ని ఆవిష్కరించి.. డివిజన్ స్థాయిలో సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆకేపాటి అమర్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి.. కేవలం 11మెడికల్ కళాశాలలు మాత్రమే ఉంటే.. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో.. ఏకంగా 17 నూతన మెడికల్ కళాశాలలను తీసుకువచ్చారని తెలిపారు. విద్య, వైద్యం, రెండు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు.. జగన్మోహన్ రెడ్డి యత్నించారని తెలిపారు. ఈరోజు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే.. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్.. (పిపిపి ) మోడ్ అని చెబుతూ..అన్ని వ్యవస్థ లను ప్రైవేటుకు కట్టబడుతుందన్నారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి నూతన మెడికల్ కళాశాలలో తీసుకు వచ్చారనే అక్కసు తోనే.. ఈరోజు చంద్రబాబు నాయుడు వాటన్నిటిని ప్రైవేటుకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. ఈ రాష్ట్రంలోదశలవారీగా 17మెడికల్ కళాశాలను ప్రారంభించాలనే సంకల్పంతో..జగన్మోహన్ రెడ్డి పనిచేసి.. ఇప్పటికే 7 మెడికల్ కళాశాలలను పూర్తి చేశారని తెలిపారు. మెడికల్ కళాశాలఅంటే.. కేవలం కళాశాల మాత్రమే కాదని.. అది ఒకవ్యవస్థలా పనిచేస్తూ..ప్రజా ఆరోగ్యానికి.. అండగా సేవలం దిస్తుందని తెలిపారు ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉందంటే.. ఆ ప్రాంతంలో ప్రజలకు ఉచిత వైద్య సేవలతో పాటు..పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించేందుకు.. అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈరోజు అవేమీ పట్టవన్నట్టుగా కూటమి ప్రభుత్వం.. ప్రజల ఆకాంక్షను కూడా.. లెక్కచేయకుండా మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడం సిగ్గుచేటన్నారు. ఈరోజు మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తూ.. కూటమి ప్రభుత్వంతీసుకున్న నిర్ణయాన్ని.. వైఎస్ఆర్సిపి తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అందులో భాగంగానే వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుతో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా.. వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కడప నియోజకవర్గంలో 60 వేల నుంచి.. లక్ష సంతకాల వరకు సేకరిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పూర్తి చేసి.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి అధ్యక్షతన గవర్నర్ గారికి పంపి..కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెస్తామన్నారు. అప్పటికి ప్రభుత్వం వెనక్కు తగ్గకపోతే.. కోర్టుల ద్వారా న్యాయపోరాటం చేస్తామన్నారు. ఈరోజు ప్రైవేట్ కు అప్పగించిన మెడికల్ కళాశాలన్నింటినీ..వైఎస్ఆర్సిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత..ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు దక్కేల చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో శేషమాంబపురం గ్రామ సర్పంచ్ సుబ్బారాయుడు,మందపల్లి సర్పంచ్ శ్రీహరి, శేషమాపురం గ్రామ కమిటీ రమణ, శ్రీను, రెడ్డయ్య, సుబ్బరాజు, భాస్కర్,సుబ్బన్న, ప్రేమ్,జితేంద్ర వర్మ,చికెన్ శ్రీను,హరిబాబు,జగదీష్, వేములయ్య, పలువురు మహిళలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయడం

# నా పూర్వజన్మ సుకృతం : ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ప్రజా సేవకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని నాయుడుపేట పట్టణంలో ఏర్పాటు చేయడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం పట్టణంలోని సీఎస్ తేజ సెంటర్ వద్ద ఏర్పాటు చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సూళ్లూరుపేట పట్టణంలో 9 అడుగులు నాయుడుపేట పట్టణంలో 10 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.కళామతల్లి ముద్దుబిడ్డ,మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రజలకు సేవ చేయడం కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి, అనతి కాలంలోనే ముఖ్యమంత్రి అయ్యారని తెలియజేశారు.రెండు రూపాయల కిలో బియ్యం పథకం, మహిళలకు ఆస్తిలో హక్కు చట్టం తీసుకువచ్చిన ఘనత ఎన్టీఆర్కే దక్కుతుందన్నారు. తమ నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ ఆశయాలను నెరవేర్చే విధంగా పాలన సాగిస్తున్నారని తెలియజేశారు.ఒకటిన్నర సంవత్సర కాలంలో ఎన్నికల హామీలైన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం తోపాటు అభివృద్ధి,సంక్షేమ పథకాలను



కొనసాగిస్తున్నారని కొనియాడారు. కూటమి పార్టీ నాయకుల సహకారంతో నియోజకవర్గాన్ని రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని సూళ్లూరుపేట,నాయుడుపేట మున్సిపాలిటీల్లో రెండు కోట్ల చొప్పున నాలుగు కోట్ల రూపాయలతో సిమెంట్ రోడ్డు నిర్మాణపనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర మున్సిపల్శాఖ మంత్రి నారాయణ ప్రతి ఇంటికి తాగునీరు అందించడం కోసం సూళ్లూరుపేట మున్సిపాలిటీకి 140 కోట్ల రూపాయలు, నాయుడుపేట మున్సిపాలిటీకి 210 కోట్ల రూపాయలు మంజూరు చేశారని, త్వరలో పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని తెలియజేశారు. నాయుడుపేట పట్టణంలో డ్రైనేజీ కాలువల నిర్మాణానికి 18కోట్ల రూపాయలు, సూళ్లూరుపేట మున్సిపాలిటీలో డ్రైనేజీ కాలువల నిర్మాణాలకు 16 కోట్లరూపాయల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ, అభివృద్ధి పథకాలను కొనసాగిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్రెడ్డి, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్, గొట్టిప్రోలు ఎంపీటీసీ సభ్యులు పల్లమాల రామిరెడ్డి,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, నాయుడుపేట మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మ,తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి,తెలుగుదేశం పార్టీ నాయకులు నెలవల రాజేష్,సంచి కృష్ణయ్య,జి విజయ్ కుమార్ నాయుడు,సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కె.అశోక్రెడ్డి,కె.గోపాలకృష్ణ, పోట్లపూడి రాజేష్,కరీంబాయి చెంచయ్య, అవధానం సుధీర్,పలుకూరు ముత్యాలయ్య, కాపులూరు చక్రపాణి,బల్లి ముత్యాలయ్య, చెందేటి సుజాత, తుపాకుల కన్నమ్మ, చేవూరు చెంగయ్య, గుంటూరు లక్ష్మయ్య, బిరదవాడ నారాయణ, మల్లాం రవికుమార్, మొండెం బాబు,పలువురు నాయకులు పాల్గొన్నారు.





# ఎమోషనల్ వార్, సైకలాజికల్ వైలెన్స్‌ని చూడబోతున్నారు..



'మిరాయ్' లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా'. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. స్టైలిస్ట్-ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా ఈనెల 17న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ,'ఈరోజు చాలా బాధగా ఉంది. ఒక ఏడాదిగా చాలా రాడికల్, ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్ ప్లే చేస్తున్నాను. ఒక వింత మనిషి బుర్రలో బతుకుతున్నాను. 17న సినిమా రిలీజ్ కాబోతుంది. వరుణ్ అనే క్యారెక్టర్‌కి గుడ్ బై చెప్పేయాలి. నేను ఎందుకు ఆ క్యారెక్టర్ గురించి అంత పర్టికులర్‌గా చెప్తున్నానో సినిమా చూస్తున్నప్పుడు మీకు అర్థం అవుతుంది. మన ఎమోషన్స్ మన కంట్రోల్‌లో ఉండాలని అర్థమవుతుంది. పవర్ కంట్రోల్ మనసులో మెయింటైన్ అవ్వాలి. ఇంకేమైనా డౌట్లు మిగిలిపోయి ఉంటే 17న థియేటర్స్‌కి వచ్చి సినిమా చూడండి. ఈ సినిమాలో వరుణ్ అనే క్యారెక్టర్ ఒక్క చుక్క రక్తం చిందించకుండా ఎమోషనల్ వార్, సైకలాజికల్ వైలెన్స్‌ని జనరేట్ చేస్తాడు. అది నా ప్రామీస్. బెర్ముడా ట్రయాంగిల్ మీద నుంచి షిప్ వెళ్లిన, ఎయిర్ క్రాఫ్ట్ వెళ్ళినా దానిలోకి లాగేసుకుంటుంది. ఈ సినిమా కూడా అలాంటి లవ్ ట్రయాంగిల్. ఈ సినిమా చూసిన వాళ్ళందరినీ కూడా అది లాగేస్తుంది' అని తెలిపారు. 'ఇది చాలా స్పెషల్ ఫిలిం. నాకు కథ చాలా నచ్చింది. ఇందులో రాగా అనే క్యారెక్టర్‌లో కనిపిస్తాను. నీరజ అద్భుతంగా రాసింది. తన విజన్ మీ అందరికీ నచ్చుతుంది. మా ప్రొడ్యూసర్స్ విశ్వ, కృతికి థ్యాంక్స్' అని హీరోయిన్ శ్రీనిధి శెట్టి చెప్పారు. మరో హీరోయిన్ రాశి ఖన్నా మాట్లాడుతూ,'నా మనసుకు చాలా దగ్గరైన సినిమా ఇది. ఇంత అద్భుతమైన క్యారెక్టర్ చేసేలా రాసినందుకు నీరజకి థ్యాంక్స్. సిద్దు, హర్ష, శ్రీనిధితోపాటు నన్ను ఒక కొత్త కోణంలో చూస్తారు' అని తెలిపారు. డైరెక్టర్ నీరజ కోన మాట్లాడుతూ,' మా నిర్మాతలు నాకు ఇచ్చిన సపోర్టు మర్చిపోలేను ఈ సినిమా ఇంత అద్భుతంగా రావడానికి కారణం వారే. సిద్దు లేకపోతే ఈ సినిమా ఉండేది కాదు. నిధి, రాశికి థ్యాంక్స్. ఈ ముగ్గురు సినిమాకి పిల్లర్స్. అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. హర్ష క్యారెక్టర్ మీ అందరిని అలరిస్తుంది. జ్ఞాన శేఖర్ విజువల్స్, తమన్ మ్యూజిక్ ఈ సినిమాకి బిగ్ అసెట్' అని తెలిపారు.

ఇది నాకు చాలా స్పెషల్ ఫిల్మ్. ఈ కథ విన్నప్పుడే చాలా కనెక్ట్ అయ్యాను. తప్పకుండా మీరు కూడా కనెక్ట్ అవుతారని భావిస్తున్నాను. సిద్ధు, రాశి, నిధి అద్భుతంగా నటించారు. నీరజ మిమ్మల్ని కచ్చితంగా సర్‌ప్రైజ్ చేస్తుంది. 17న అందరూ సినిమాని బిగ్ స్క్రీన్‌లో చూసి ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను.

## 'కె-ర్యాంప్' రిలీజ్‌కి రెడీ




తన సినిమాలను ప్రేక్షకులకు బాగా రీచ్ అయ్యేందుకు సాధ్యమైనంత కొత్తగా ప్రయత్నిస్తుంటారు హీరో కిరణ్ అబ్బవరం. ఆయన తన లేటెస్ట్ మూవీ 'కె-ర్యాంప్' పై కూడా ఆడియెన్స్‌లో మంచి ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తున్నారు. గతంలో తన సినిమా 'ఎస్ఆర్ కల్యాణమండపం'కు డీజే మిక్స్ చేసి ఆ కంటెంట్‌ను వైరల్ చేశారు. ఇప్పుడు ఈ చిత్ర టీజర్, ట్రైలర్‌తో డీజే మిక్స్ చేసి యూత్ ఆడియెన్స్‌ను అట్రాక్ట్ చేస్తున్నారు. ఈ డీజే మిక్స్ సినిమా మీద ఒక వైబ్ క్రియేట్ చేస్తోంది. టీజర్, ట్రైలర్‌లో పేలిన డైలాగ్స్ అన్నీ ఈ డీజే మిక్స్‌లో యాడ్ చేయడం కొత్త ఫీల్ కలిగిస్తోంది. ఈ సినిమాను హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్స్‌పై రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మించారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహించారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా ఈనెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

# మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



'లవ్ టుడే, డ్రాగన్' వంటి రెండు వరుస హిట్‌లను అందించిన హీరో ప్రదీప్ రంగనాథన్ 'డ్యూడ్'తో దీపావళికి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా నేడు (శుక్రవారం) తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ, 'హైదరాబాద్ నాకు ఇంకో ఫ్యామిలీ. నా సినిమాలన్నీ గొప్పగా ఆదరించారు. మీ అభిమానానికి కృతజ్ఞతలు. మీ కుటుంబంలో ఒకరిగా చూసినందుకు చాలా థ్యాంక్స్. 'లవ్ టుడే, డ్రాగన్' మీకు నచ్చినట్లయితే ఖచ్చితంగా 'డ్యూడ్' కూడా నచ్చుతుంది. అదిరిపోయే సినిమా ఇది. మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ మైత్రి మూవీ మేకర్స్‌కి థ్యాంక్స్. నాకు తెలుగులో ఇంకా ఎక్కువగా కనెక్ట్ అవ్వాలని ఉంటుంది.

ఇది నాకు మంచి అవకాశం. మైత్రి మూవీ మేకర్స్ చాలా అద్భుతంగా పే చేస్తారు. ఈ సినిమా కోసం చాలా మంచి పేమెంట్స్ తీసుకున్నాను.(నవ్వుతూ)డైరెక్టర్ కీర్తికి థాంక్యూ. చాలా మంచి సినిమా తీశాడు. సినిమా చూసిన తర్వాత అతను ఎంత పెద్ద డైరెక్టర్ అవుతారో మీరే చెప్తారు. సాయి చాలా పెద్ద కంపోజర్ అవుతాడు. ఇప్పటికే తనకి చాలా మంది అభిమానులు ఏర్పడ్డారు. మమితకి అద్భుతమైన ఎనర్జీతో నటించింది. ఈ సినిమా తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది' అని తెలిపారు. హీరోయిన్ మమిత బైజు, డైరెక్టర్ కీర్తి ఈశ్వరన్, డైరెక్టర్ హను రాఘవపూడి, డైరెక్టర్ బుచ్చిబాబు సాన, డైరెక్టర్ సాయి రాజేష్, డైరెక్టర్ రాహుల్ సాంకృత్యన్ , డైరెక్టర్ మహేష్, డైరెక్టర్ శివ నిర్వాణ, నిర్మాత రవిశంకర్, నిర్మాత నవీన్ ఎర్నేని, గీత రచయిత రామ జోగయ్య శాస్త్రి, మ్యూజిక్ డైరెక్టర్ సాయి అభ్యంకర్, డిఓపి నిఖిత్ బొమ్మి తదితరులు ఈ వేడుకలో పాల్గొని, చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.



# ముగ్గురు సభ్యులతో జాతీయ స్పోర్ట్స్ బోర్డు


## వెబ్‌సైట్‌లో ముసాయిదా.. అభ్యంతరాలకు 30 రోజుల గడువు



న్యూఢిల్లీ: నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ చట్టం (2025)లో భాగంగా ప్రతిపాదిత జాతీయ క్రీడా బోర్డు (ఎన్ఎస్‌బి) సహా నేషనల్ స్పోర్ట్స్ ఎలక్షన్ ప్యానల్ (ఎన్ఎస్ఈపీ) ముసాయిదా రూల్స్‌ను కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. జాతీయ క్రీడా బిల్లు అమలులో ఎన్ఎస్‌బి, ఎన్ఎస్ఈపీ అత్యంత కీలకం. ఈ రెండు బోర్డుల నిబంధనలు, సభ్యులు, అర్హతలకు సంబంధించిన వివరాలతో కూడిన ముసాయిదాపై ఏమైనా అభ్యంతరాలను 30 రోజుల్లో చెప్పాలని క్రీడామంత్రిత్వ శాఖ సూచించింది. ముసాయిదా ప్రకారం జాతీయ క్రీడా బోర్డులో ముగ్గురు సభ్యులు ఉంటారు. పదవీ కాలం మూడేండ్లు, గరిష్ట వయో పరిమితి 65 ఏండ్లు. వయో అర్హత ఉంటే రెండోసారి సైతం బోర్డుకు ఎంపిక అయ్యేందుకు అర్హులే. జాతీయ క్రీడా సమాఖ్యలకు నేషనల్ స్పోర్ట్స్ బోర్డు గుర్తింపు ఇస్తుంది. ఎన్ఎస్‌బి గుర్తింపు ఉంటేనే క్రీడా సమాఖ్యలకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. క్యాబినెట్ కార్యదర్శి, క్రీడా శాఖ కార్యదర్శి, ఇద్దరు జాతీయ క్రీడా పురస్కార గ్రహీతలు, ఓ కేంద్ర ప్రభుత్వ నామిని, క్రీడా పరిపాలనలో అనుభవం కలిగిన వ్యక్తులతో కూడిన సెలక్షన్ కమిటీ ఎన్ఎస్‌బి బోర్డు సభ్యులను నియమిస్తుంది. ఎన్ఎస్‌బి సభ్యులు ఏదేనీ జాతీయ, అంతర్జాతీయ క్రీడా సంఘాల్లో ఎటువంటి పదవిలో కొనసాగడానికి వీల్లేదు. క్రీడా సంఘాలు, సమాఖ్యల్లో వివాదాల పరిష్కారానికి జాతీయ స్పోర్ట్స్ ట్రిబ్యునల్ (ఎన్ఎస్‌టీ) ఏర్పాటు చేయనున్నారు. వివాదాలు కోర్టుల వరకూ వెళ్లకుండా.. ట్రిబ్యునల్‌లో తేల్చుకునే వ్యవస్థను తీసుకురానున్నారు. నేషనల్ స్పోర్ట్స్ ఎలక్షన్ ప్యానల్ (ఎన్ఎస్ఈపీ) జాతీయ క్రీడా సమాఖ్యల ఎన్నికల ప్రక్రియలను పర్యవేక్షించి, నిర్వహించనుంది. ఎన్నికల నిర్వహణకు ఎన్ఎస్ఈపీలో 20 మంది సభ్యులు ఉంటారు. జాతీయ క్రీడా సమాఖ్యలు సహా ఒలింపిక్ సంఘంలో అథ్లెట్ల కోటా అడ్మినిస్ట్రేటర్లుగా వ్యవహరించే క్రీడాకారులకు సైతం అర్హతలను నిర్ణయించారు. సమ్మర్, వింటర్ ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన, ప్రాతినిధ్యం వహించిన అథ్లెట్లు మాత్రమే జాతీయ క్రీడా సమాఖ్యలు, ఒలింపిక్ సంఘంలో అథ్లెట్ల కమిషన్‌లో ఉండేందుకు అర్హులు. ఓవరాల్‌గా ప్రాధాన్య క్రమంలో పది కేటగిరీల్లో క్రీడాకారుల అర్హతలను పేర్కొన్నారు.

# మన క్రికెటర్లు విదేశీ లీగ్‌ల్లో ఆడాలి!

## మాజీ చీఫ్ కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్యలు



ముంబయి: అంతర్జాతీయ స్థాయి క్రికెట్‌లో ఒత్తిడిని ఎదుర్కొవటం, భిన్న పరిస్థితులకు అనుగుణంగా ఆటలో మార్పులు చేసుకోవటం సహా అపూర్వ అనుభవం కోసం భారత క్రికెటర్లు సైతం విదేశీ టీ20 లీగ్‌ల్లో ఆడాలని భారత జట్టు మాజీ చీఫ్ కోచ్ రవిశాస్త్రి అన్నాడు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ రవిశాస్త్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన క్రికెటర్లకు మాత్రమే బీసీసీఐ ఎన్ఓసీ (నిరభ్యంతర పత్రం) జారీ చేస్తోంది. ఇటీవల ఐపీఎల్ సహా అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించిన రవిచంద్రన్ అశ్విన్.. బిగ్‌బాష్ లీగ్‌లో సిడ్నీ థండర్ జట్టుతో చేరాడు. ఇటువంటి అవకాశాలు యువ క్రికెటర్లకు దక్కాలని రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు.

భారత్ ఎంతో విశాలమైన దేశం. ప్రతి ఒక్కరికి క్రికెట్ జట్టులో చోటు దక్కదు. ఆశావహులు అందరికీ ఐపీఎల్‌లో అవకాశం లభించదు. మరి ఎందుకు, యువ క్రికెటర్ల విదేశీ లీగ్ అవకాశాలను అడ్డుకోవటం?. విదేశీ లీగ్‌లో గడించిన అనుభవం ఆ క్రికెటర్లకు ఇక్కడ దేశవాళీలో ఉపయోగపడుతుంది. ఐపీఎల్‌తో యువ క్రికెటర్లు లబ్ది పొందినట్టే.. విదేశీ లీగ్‌ల్లో ప్రపంచ శ్రేణి క్రికెటర్లతో ఆడిన అనుభవం మన క్రికెటర్లకు దక్కుతుంది. ఒత్తిడి పరిస్థితులను ఎలా ఎదుర్కొవాలో నేర్చుకుంటారు. దిగ్గజ క్రికెటర్లు పాంటింగ్, ఫ్లెమింగ్ వంటి శిక్షణలో రాటుదేలుతారు. విదేశీ లీగ్‌ల్లో క్రికెట్ ఆడటం నాకు తెలిసి ఓ ఎడ్యుకేషన్. క్రికెట్ నేర్చుకునే, ఆడే పద్దతులు ఒక్కో దేశంలో ఒక్కో విధంగా ఉంటాయి. భిన్న పరిస్థితులను అర్థం చేసుకోవటంతో నాణ్యమైన క్రికెటర్లు తయారవుతారు' అని రవిశాస్త్రి అన్నాడు.

# తిలక్‌వర్మని సన్మానించిన మెగాస్టార్



ఇటీవల ఆసియా కప్ ఫైనల్లో పాకిస్తాన్‌పై భారత్ ఘనవిజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిన యువ క్రికెటర్ తిలక్ వర్మను చిరంజీవి సన్మానించారు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడుతూ, అద్భుతమైన ఇన్నింగ్స్‌తో భారత్ విజయంలో కీలకమైన భాగస్వామిగా నిలిచిన తిలక్ వర్మ ప్రతిభను అభినందిస్తూ, ఘనంగా సన్మానించారు. ఈ అరుదైన సందర్భానికి 'మన శంకర వరప్రసాద్ గారు' షూటింగ్ వేదిక అవ్వడం విశేషం. తిలక్ వర్మను షూటింగ్‌కి ఆప్యాయంగా ఆహ్వానించి, ఆయనకు శాలువా కప్పి, మ్యాచ్‌లోని ఆయన మెమొరబుల్ మూమెంట్‌ని ఫ్రేమ్ చేసిన ఫోటోను బహుమతిగా అందజేశారు. కృషి, క్రమశిక్షణ కేవలం క్రీడలోనే కాకుండా జీవితంలోనూ విజయానికి మార్గదర్శకమని చిరంజీవి అన్నారు.

ఈ వేడుకలో నయనతార, దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహు గరపాటి, సుస్మిత కొణిదెల తదితరులు సైతం పాల్గొని, తిలక్ వర్మ ఆడిన తీరును ప్రశంసించారు. తనని పిలిచి, ప్రేమతో సన్మానించిన మెగాస్టార్‌కి ఈ సందర్భంగా క్రికెటర్ తిలక్ వర్మ కృతజ్ఞతలు తెలిపారు. చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబోలో రూపొందుతున్న 'మన శంకర వరప్రసాద్‌గారు' షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన 'మీసాల పిల్ల' విశేష శ్రోతకాదరణతో ట్రెండింగ్‌లో నిలిచింది. దేశ వ్యాప్తంగా ట్రెండ్ అవుతూ 17 మిలియన్ వ్యూస్‌కి పైగా సొంతం చేసుకుంది. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# వైసీపీకి ఏమైంది...

**విజయవాడ, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో అసలు ఏం జరుగుతోంది? ఆ పార్టీ గత వైభవం దిశగా అడుగులు వేసే పరిస్థితి ఉందా? 2029 ఎన్నికల్లో సత్తా చాటే పరిస్థితి ఉందా? అసలు ఆ పార్టీలో ఏం జరుగుతోంది? ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. 2014 ఎన్నికల్లో ఆ పార్టీ ప్రతిపక్షానికి పరిమితం అయింది. కానీ అనతి కాలంలోనే అధికార టిడిపికి చుక్కలు చూపించింది. కానీ ఇప్పుడు ఎందుకు ఆ పరిస్థితి లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విఫలమైందా? లేకుంటే టీడీపీ కూటమి ప్రభుత్వం గుణపాఠం నేర్చుకుందా? దీనిపై బలమైన చర్చ నడుస్తోంది. అయితే అప్పటికి ఇప్పటికీ కేంద్రం వైఖరి మారింది. అదే తెలుగుదేశం కూటమికి ప్లస్సు అయ్యింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మైనస్ గా పరిణమించింది. 2014లో ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉంది తెలుగుదేశం పార్టీ. అంతకుముందు బిజెపి వాజ్పేయి నేతృత్వంలో ఉండేది. ఆ తరువాత స్థానం లాల్ కృష్ణ అద్వానీ అలియాస్ ఎల్కే అద్వానీ ఉండేది. అప్పటికే చంద్రబాబు చతురత పనిచేసేది. మిగతా నేతలతో పోల్చుకుంటే చంద్రబాబు సీనియర్ కూడా. వయసు రీత్యా అటల్ బిహారీ వాజ్పేయి సీనియర్ కానీ.. క్షేత్రస్థాయిలోకి వచ్చేసరికి చంద్రబాబు అప్పటికే తనకు తాను నిరూపించుకున్నారు. ముఖ్యంగా నందమూరి తారక రామారావును అధికారానికి దూరం చేసి తాను సొంతం చేసుకున్నారు. అంతటి ప్రతికూల పరిస్థితుల్లో సైతం 1999 ఎన్నికల్లో ఉమ్మడి ఏపీలో గెలిచారు.




అందుకే చంద్రబాబుకు వాజ్పేయి తో పాటు ఎల్కే అద్వానీ ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. కానీ 2014లో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ మరోసారి ఎన్డీఏకు దగ్గరయింది కానీ.. మునుపటి బిజెపి పెద్దల మాదిరిగా చంద్రబాబును నమ్మే స్థితి లేదు. దాని పర్యవసానం అనుభవించారు చంద్రబాబు. దాని నుంచి గుణపాఠాలు నేర్చుకుని 2024 ఎన్నికల్లో సర్వశక్తులు ఒడ్డి బిజెపిని తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు చంద్రబాబు. అలా మూడు పార్టీల కలయికతో అద్భుత విజయం సొంతం చేసుకున్నారు.

అయితే గత పరిస్థితుల దృష్ట్యా పవన్ కళ్యాణ్ బలమైన మద్దతుదారుడుగా మార్చుకున్నారు చంద్రబాబు. తద్వారా భారతీయ జనతా పార్టీని సైతం తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఎందుకంటే ఒక జాతీయ పార్టీగా మూడుసార్లు అధికారంలోకి వచ్చిన పార్టీకి ప్రజా వ్యతిరేకత అనేది సర్వసాధారణం. అదే సమయంలో మిత్రుల ద్వారా బలపడాలన్నది బిజెపి వ్యూహం. ఆ పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో పరిమితంగా ఉంది మిత్రపక్షాల పాత్ర. అదే సమయంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా పక్షం పెద్ద ప్రాంతీయ పార్టీలతో బలంగా ఉంది. అదే ఎన్డీఏ విషయంలో బిజెపి తర్వాత పెద్ద పార్టీగా టిడిపి ఉంది. అటు తరువాత నితీష్ నేతృత్వంలోని జెడియు, అకాలి దళ్, ఆపై దేవే గౌడ జెడిఎస్ ఉంది. అయితే ఉన్నంతలో తెలుగుదేశం పార్టీ సీనియర్. ఆపై చంద్రబాబు జాతీయస్థాయిలో మంచి నాయకుడు. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీకి భారతీయ జనతా పార్టీ అధిక ప్రాధాన్యం ఇస్తూ వస్తోంది.అయితే బిజెపికి సిద్ధాంతపరంగా వ్యతిరేక పార్టీ వైయస్సార్ కాంగ్రెస్. ఆ పార్టీ పరోక్ష మద్దతు కే తప్ప.. ప్రత్యక్షంగా ఇచ్చే మద్దతుకు ప్రజలు హర్షించరు. ఆ విషయం బిజెపికి తెలుసు. అందుకే ఆ పార్టీని దూరంగా పెడుతోంది కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి. కానీ జగన్మోహన్ రెడ్డి తన వ్యక్తిగత అవసరాల దృష్ట్యా భారతీయ జనతా పార్టీతో మమేకం అయ్యేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అది పొలిటికల్ గా చాలా డ్యామేజ్ చేస్తోంది. 2014లో బలమైన ప్రతిపక్షంగా వైయస్సార్ కాంగ్రెస్ ఉంది. 2019లో ఏకపక్షంగా అధికారాన్ని సొంతం చేసుకుంది. 2024లో డిజాస్టర్ ఫలితాలను చవిచూసింది. అయినా సరే ఆ పార్టీ ఎందుకో ఇంకా బీజేపీ అంటూ జపం చేస్తోంది. అది ఎంత మాత్రం నష్టం తప్ప లాభం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఖరిలో మాత్రం మార్పు రావడం లేదు.

# మిథున్ రెడ్డిని వెంటాడుతున్న సిట్

**తిరుపతి, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** ఏపీలో మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టించింది. ప్రస్తుతం ఈ కేసు విచారణ చేపడుతుంది ప్రత్యేక దర్యాప్తు బృందం. ఒకవైపు విచారణ కొనసాగుతోంది. 29 మంది నిందితులకు గాను 12 మంది అరెస్టయ్యారు. అయితే లోతైన దర్యాప్తు చేస్తుండగా.. నిందితులు ఒక్కొక్కరికి బెయిల్ లభిస్తోంది. ఈ క్రమంలో బెయిల్ పై బయటకు వచ్చిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కార్యాలయాలతో పాటు నివాసాల్లో సిట్ తనిఖీలు చేపడుతుండడం విశేషం. మరోవైపు ఎంపీ మిథున్ రెడ్డి బిజెపిలో చేరతారని ప్రచారం సాగింది. ఈ క్రమంలో ఆయన ఐక్యరాజ్యసమితికి వెళ్లే పార్లమెంటరీ బృందంలో ఒక సభ్యుడిగా ఉండడం ప్రాధాన్యత సంతరించుకుంది. బిజెపిలో చేరుతారన్న అనుమానాలను మరింత బలపరిచింది. అయితే ఈరోజు తిరుపతి తో పాటు హైదరాబాద్, బెంగళూరు నివాసాల్లోను సోదాలు జరుగుతున్నాయి.వైయస్ జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి. అప్పట్లో మద్యం లావాదేవీలు అన్ని మిథున్ రెడ్డి చూసేవారని టాక్ ఉంది. వైసీపీ హయాంలో ప్రతి శనివారం తాడేపల్లికి వచ్చి.. లిక్కర్ లెక్కలు చెప్పేవారని వైసీపీలోని ప్రచారం సాగుతోంది. ఈ విషయాన్ని వైసిపి నేతలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తుంటారు కూడా. అయితే మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడు తో సమానంగా.. పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కమిషన్ల రూపంలో ఎక్కువగా వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.



అయితే ఇటీవల పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కోర్టులో బెయిల్ లభించింది. అయితే చంద్రబాబుతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒప్పందం చేసుకున్నారన్న అనుమానాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వినిపించాయి. అందుకే చాలా రకాల కేసుల్లో పెద్దిరెడ్డికి మినహాయింపు లభించింది అన్న కామెంట్స్ ఉన్నాయి. పైగా ఎన్నికల సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తుడుచుపెట్టుకుపోయింది. అటువంటి సమయంలో పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులందరూ గెలిచారు. ఇలా గెలవడం వెనుక మ్యాచ్ ఫిక్సింగ్ ఉందన్న అనుమానాలు జగన్మోహన్ రెడ్డిలో బలంగా పెరిగాయి. ఆ కారణం చేతనే తాజాగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని దూరం పెట్టారన్న టాక్ వినిపిస్తోంది. ప్రధానంగా పెద్దిరెడ్డి కి చెందిన పి ఎల్ ఆర్ కంపెనీల ద్వారానే మద్యం కుంభకోణంలో లభించిన బ్లాక్ మనీని.. వైట్ గా మార్చారన్న అనుమానాలు ఉన్నాయి. ఆ అనుమానం తోనే పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పై కేసు నమోదు చేసింది ప్రత్యేక దర్యాప్తు బృందం. అయితే పిఎల్ఆర్ కంపెనీల ద్వారా జరిగిన లావాదేవీల విషయంలో సిట్ పట్టు బిగిస్తున్నట్లు తెలుస్తోంది. అది తెలిసి జగన్మోహన్ రెడ్డి తన వరకు వస్తుందన్న అనుమానంతోనే పెద్దిరెడ్డి కుటుంబాన్ని సైడ్ చేసినట్లు ప్రచారం సాగుతోంది. మొత్తానికైతే ఎంపీ మిథున్ రెడ్డి ని టార్గెట్ చేసుకొని సిట్ దర్యాప్తు చేస్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది.

### మద్యం మలుపులు

కల్తీ మద్యం కేసులో అనేక ట్విస్టులు చోటు చేసుకుంటున్నాయి. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడైన జనార్ధన్ రావు విడుదల చేసిన వీడియో పై వైసీపీ సోషల్ మీడియాలో అనేక ప్రశ్నలు వినిపిస్తున్నాయి. జనార్ధన్ రావు చేత తప్పుడు స్టేట్ మెంట్ ఇప్పించారంటూ వైసీపీ నేతలు నేరుగానే విమర్శలు చేస్తున్నారు. కల్తీ మద్యం కేసును వైసీపీ మెడకు చుట్టాలన్న ప్రయత్నంలో చేసిన హడావిడిలో అసలు విషయాలను మర్చిపోయి వ్యవహరించారన్నది వైసీపీ నేతలు ఘాటుగానే విమర్శలు చేస్తున్నారు. జనార్ధన్ రావు వీడియోలో తనకు మాజీ మంత్రి జోగి రమేష్ చెబితేనే తాను కల్తీమద్యం ప్లాంట్ ను ములకలచెరువులో పెట్టానని అన్నారు. అప్పుడే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంపై బురద జల్లేందుకు వీలవుతుందని ఆయన తెలిపారు. అయితే జనార్ధన్ రావు ఆఫ్రికాలో ఉన్న సమయంలో ఒక వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో కూడా కల్తీ మద్యం కేసులో టీడీపీ నేతలకు సంబంధం లేదని చెప్పి సంకేతాలిచ్చారని, ఆ తర్వాతనే జనార్ధన్ రావును విదేశాల నుంచి రావాలని చెప్పడంతో ఆయన వచ్చాడని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. నిజానికి జోగి రమేష్ కు అత్యంత సన్నిహిత మిత్రుడైతే జనార్ధన్ రావు విదేశాల నుంచి రాకూడదని, కానీ తానే వచ్చి .. అంతే కాకుండా తాను వస్తున్న సమాచారాన్ని కూడా ఎక్సైజ్ పోలీసులకు ఇచ్చి గన్నవరం ఎయిర్ పోర్టులో అరెస్ట్ కావడం వెనక పెద్ద కుట్ర జరిగిందన్నది వైసీపీ నేతల ప్రధాన ఆరోపణ. కల్తీ మద్యం కేసులో జనార్ధన్ రావును పక్కనపెడితే అదే కేసులో ఉన్న జయచంద్రారెడ్డితో పాటు మరికొందరు నేతలు టీడీపీకి చెందిన వారేనని వైసీపీ నేతలు అంటున్నారు. వైసీపీ నేతలు సీబీఐ విచారణ కోరటం వెనక కొన్నేళ్ల పాటు కేసు విచారణలో తాత్సారం చేయడానికేనని చంద్రబాబు ప్రకటించిన గంటల్లోనే జనార్ధన్ రావు వీడియో విడుదల కావడం కూడా తమకు అనుమానంగా ఉందని అంటున్నారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం పై తమకు నమ్మకంలేదంటున్న వైసీపీ నేతలు ఈ కేసులో నిజానిజాలు వెలుగులోకి రావాలంటే సీబీఐకి అప్పగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం విచారణ పారదర్శకంగానే సాగుతుందని ఇందులో ఎలాంటి వివక్ష ఉండదని, రాజకీయ కుట్ర బయటపడుతుందన్న కారణంతోనే వైసీపీ నేతలు ఇలా మాట్లాడుతున్నారని టీడీపీ నేతలు కౌంటర్ ఇస్తున్నారు. మొత్తం మీద ములకల చెరువు కల్తీ మద్యం కేసులో ఎప్పుడు ఏ రకమైన ట్విస్ట్ చోటు చేసుకుంటుందన్నది మాత్రం ఆసక్తికరంగానే మారింది.

## సంగీత కళలో ప్రత్యేక శిక్షణ

- **ప్రముఖ హార్మోనిస్ట్, తబలిస్ట్ ఎం.సురేష్ బాబు**



**రాయచోటి, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో జనరల్ సంగీత శిక్షణాలయం ఆధ్వర్యంలో పిల్లలకు, పెద్దలకు, అందరికీ అర్థమయ్యే రీతిలో సంగీత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రముఖ హార్మోనిస్టు, తబలిస్ట్, ఎం. సురేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక ప్రత్యేక సంగీత కళాకారులచే హార్మోనియం, కీబోర్డ (ఎలక్ట్రికల్ ఇన్స్టుమెంట్) తబలా, డోలక్, డప్పు, ప్యాడ్ (ఎలక్ట్రికల్ రిథమ్) వయోలిన్, మృదంగం, ఫ్రూట్, ఓకల్ వంటి భక్తి పాటలలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. సంగీతం పట్ల ఆసక్తి గలవారు 9652095734 నెంబర్కు ఫోన్ చేసి పూర్తి సమాచారం తెలుసు కోవచ్చునని అన్నారు.

## మహిళా కోచ్ లో మగాళ్ళను ఎలా అనుమతిస్తారు..?


**- రైలు ప్రయాణీకురాలిపై అత్యాచార ఘటన బాధాకరం**
**- గుంటూరు-పెదకూరపాడు స్టేషన్ల మధ్య ఘటనపై స్పందించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ**

**అమరావతి, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** రైళ్ళల్లో మహిళలకు కేటాయించిన కోచ్ లలో మగాళ్ళను ఎలా అనుతిస్తారని ఏపీ మహిళా కమిషన్ డాక్టర్ రాయపాటి శైలజ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సంత్రగాచి స్పెషల్ రైలులో ప్రయాణిస్తున్న మహిళా ద్యాణింజుా పై గుంటూరు, పెదకూరపాడు రైల్వే స్టేషన్ల మధ్య జరిగిన అత్యాచార ఘటనపై బుధవారం ఆమె స్పందించారు. ఘటన చాలా బాధాకరమన్నారు. ఈమేరకు ఘటన పూర్వాపరాలను గుంటూరు ఆర్పీఎఫ్ అధికారులతో మాట్లాడి చర్యలనిమిత్తం మహిళా కమిషన్ అధికారులను ఆమె ఆదేశించారు. దీంతో కార్యాలయ అధికారులు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ తో ఫోన్ లో సంప్రదించగా.. ఓ మహిళ రాజమహేంద్రవరంలో సంత్రగచి ప్రత్యేక ఎక్స్ప్రెస్ ట్రైన్లో చెర్లపల్లి దాకా ప్రయాణించడానికి ఎక్కగా.. ట్రైన్ గుంటూరు స్టేషన్లో ఆగిన సమయంలో, 40 సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి మహిళా కోచ్లోకి ప్రవేశించాడని.. ఆగంతకుడు మహిళను కత్తితో బెదిరించి అత్యాచారానికి పాల్పడినట్లు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు అందిందన్నారు. బాధితురాలి వద్దనున్న నగదు (రూ.5600) మరియు మొబైల్ ను దోచుకున్నట్లు ..పెదకూరపాడు స్టేషన్ దగ్గర రైలులోంచి దూకి పరారైనట్లు బాధితురాలు ఫిర్యాదిచ్చినట్లు చెప్పారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేసి, కేసును నడికుడి పోలీస్ స్టేషన్కు బదిలీ చేసినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడానికి పోలీసు బృందాలు దర్యాప్తు చేపట్టాయని.. బాధితురాలు చెబుతున్న ప్రకారం గుంటూరు, పెదకూరపాడు రైల్వేస్టేషన్ ల మధ్య మొబైల్ ట్రాక్ లోకేషన్లు, సీసీ ఫుటేజీలు, ఇతర సాంకేతికత ద్వారా నిందితుడ్ని పట్టుకునేందుకు చర్యలు చేపట్టామని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు చెప్పారు.

### డీఆర్ఎం, ఆర్పీఎఫ్ ఎస్పీలకు లేఖలు:

తక్షణమే ఈ కేసుపై వేగవంతమైన దర్యాప్తును ప్రారంభించి నేరస్తుడిని అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులను కోరారు. ఈమేరకు గుంటూరు రైల్వేస్టేషన్ డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం)కు, విజయవాడ రైల్వే సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఎస్పీ), డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే సెక్యూరిటీ ఫోర్స్, గుంటూరు వారికి మహిళా కమిషన్ ద్వారా బుధవారం లేఖలు పంపారు. మహిళా ప్రయాణికుల భద్రతను నిర్ధారించే చర్యలు వేగవంతం చేయాలన్నారు. మహిళా కంపార్ట్మెంట్లో మహిళా కానిస్టేబుళ్లను డ్యూటీకి నియమించాలని, మహిళల కోచ్ లలో ప్రయాణించడానికి ప్రయత్నించకుండా పురుషులను నిరోధించడానికి ఆర్పీఎఫ్ క్రమం తప్పకుండా డ్రైవ్లను నిర్వహించాలని కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ కోరారు. రైళ్లలో ప్రయాణీకులకు సంబంధించిన భద్రతా లోపాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి చర్యలు చేపట్టాలన్నారు. ఒంటరి మహిళా ప్రయాణీకుల భద్రతపై మరింత నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. సంత్రగాచి స్పెషల్ ఎక్స్ప్రెస్ లో జరిగిన ఘటనపై పూర్తి దర్యాప్తు అనంతరం కమిషన్ కు నివేదిక పంపాలని లేఖలో ఆమె కోరారు.

## కొండకు ఢీకొన్న లారీ.. డ్రైవర్ మృతి..



**గిద్దలూరు, సూర్య వాస్తవం, అక్టోబర్ 16:** ప్రకాశం జిల్లా గిద్దలూరు టు నంద్యాల హైవే ఘాటు రోడ్డులో కర్నూలు నుండి విజయవాడకు టీజీ వెంకటేష్ ఫ్యాక్టరీ నుండి కెమికల్ లోడుతో లారీ విజయవాడ బయలుదేరి వస్తుం డగా గిద్దలూరు ఘాట్ రోడ్డు నందు మలుపు వద్ద గురువారం తెల్లవారం తెల్లవారుజామున లారీ అదుపుతప్పి కొండకు ఢీకొట్టింది. ఘటనలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ రోడ్డు కు అడ్డంగా నిలిచిపోయింది . గిద్దలూరు టు నంద్యాల కు వాహనాలు పోవడానికి వీలు లేకుండా లారీ ఉండడంతో సుమారు ఒక కిలోమీటర్ మేరకు వాహనాలు నంద్యాల వైపు గిద్దలూరు వైపు నిలిచిపోయాయి.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI ) CELL : 80740 10854